

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 1 డిసెంబరు 2024





ప్రాజెక్టు ఆఫీసు నమూనా డిజైన్లు



- అమరావతి ప్రతి నిర్మాణంలోనూ ప్రజా భాగస్వామ్యం
- సీఆర్‌డీఏ కార్యాలయ నమూనాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- పది డిజైన్లను వెబ్‌సైట్‌లో ఉంచి ఓటింగ్ కోరిన సీఆర్‌డీఏ
- మెజారిటీ ఓటింగ్ ప్రకారమే ప్రాజెక్టు ఆఫీసు నమూనా ఎంపిక

ప్రజాభిప్రాయంతోనే..

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో తలపెట్టే ప్రతి పనికీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానిలో చేపట్టే ఏ పనైనా, ప్రాజెక్టు నిర్మాణాలైనా ప్రజల ఆకాంక్షలు, సూచనల మేరకు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఆర్‌డీఏ అధికారులు అమల్లోకి తీసుకువచ్చారు. రాజధానిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. ముందుగా తమ సొంత ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపై ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసుకు సంబంధించి రూపొందించిన మొత్తం 10 డిజైన్లను సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ పది డిజైన్లలో ఏది నచ్చిందో ఓటు వేసే పోల్ ఆప్షన్ ఇచ్చారు. వరుస క్రమంలో పది నమూనాలు ఉంటాయి. ఈ నమూనాలను జూమ్ చేసుకుని చూసే సదుపాయాన్ని కూడా కల్పించారు. నచ్చిన డిజైన్‌ను ఎంచుకోవాలి. డిజైన్‌ను ఎంచుకున్న తర్వాత పేరు, విద్యార్హతలు, ఫోన్ నెంబర్, రివ్యూ కోరుతూ ఒక పాపఅప్ వస్తుంది. అవన్నీ పూర్తి చేసిన తర్వాత సబ్‌మిట్ చేయాలి. శనివారం మధ్యాహ్నం దీనిని అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. దీనిపై ఇంకా ప్రచారం కూడా చేపట్టకపోయినా.. సాయంత్రం 5 గంటలకి 438 మంది ఓటింగ్ వేశారు. ఆదివారం నుంచి సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్లకు ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ పది డిజైన్లలో దేనికి మెజారిటీ ఓటింగ్ వస్తుందో ఆ డిజైన్‌నే సీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేస్తారు.



కొల్లిపర సమీపంలో వర్షానికి నేలవాలిన వరిపంట

వర్షం.. కష్టం

- పలు చోట్ల నేలవాలిన వరి
- రైతులను వెంటాడుతోన్న ఫెంగల్
- తుఫాన్ ప్రభావంతో అన్నదాతల్లో ఆందోళన
- మొలకలు వచ్చే అవకాశం ఉండడంపై అన్నదాతల ఆవేదన



పొన్నూరు: రహదారి పక్కన పట్టాలు కప్పి ఉంచిన ధాన్యం



వట్టిచెరుకూరు: వర్షాల నేపథ్యంలో ధాన్యం రాసిపై కప్పిన టార్పాలిన్ పట్టలు

కొల్లూరు: మొసలిపాడు వద్ద వర్షానికి తడిసిన వరి ఓదెలు



కొల్లిపర మండలం చివలూరు సమీపంలో వరికుప్పకు పట్టాలు కప్పుతున్న రైతులు





కొల్లిపర మండలం సిరిపురం సమీపంలో నెలకొరిగిన వరిపంటను యంత్రాల ద్వారా నూర్పిడి చేయిస్తున్న రైతులు



నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచిక ఎగురవేత..

కొల్లిపర, పొన్నూరుటౌన్, వట్టిచెరుకూరు, బాపట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అననుకూల పరిస్థితులను అధిగమించారు. భారీ వర్షాలు.. వరదలను ఎదిరించారు. తెగుళ్లను తట్టుకున్నారు. పంట చేతికి వచ్చేసింది. ఇక కోతలే అనుకుంటున్న తరుణంలో ఫెంగస్ తుఫాన్ రైతన్నల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. ఫెంగల్ తుఫాన్ ప్రభావం బాపట్ల జిల్లాపై ఎక్కువగా ఉండగా గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులను వణికిస్తోంది. పంట కొత్తకు వచ్చిన సమయంలో వరుణుడు దోబూచులాడుతుండడంతో రైతులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరు జల్లులకే పరిమితమవగా శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. పంట చేతికి అందే సమయంలో వర్షాలు కురిస్తే వరి, పత్తి, మిరప పంటలు తడిచి గింజలు కుళ్ళి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన వరి నేలవాలుతుంటే గింజలు మొత్తం రాలి పోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. గతంలో వచ్చిన ప్రకృతి విపత్తులతో ఇప్పటికే కుదేలై ఉన్న సమయంలో అరకొరగా చేతికొచ్చే పంట కూడా దక్కకుండా పోతుందేమోనన్న బెంగ రైతులను వెంటాడుతున్నది. వర్షాలతో కొంతమంది రైతులు వరి కోతలను వాయిదా వేసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని వర్షం భయంతో బస్తాల్లోకి ఎత్తి ఉంచారు. రెండు రోజుల క్రితం యంత్రాలతో కోత కోయగా వచ్చిన దాన్యాన్ని రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసుకుని ప్లాస్టిక్ పట్టాలతో భద్రపరుచుకున్నప్పటికీ వర్షానికి చెమ్మ చేరింది. పత్తి తడవకుండా రైతులు టార్పాలిన్ కప్పి పిడుగురాళ్ల సీసీఐ కేంద్రానికి తరలించే రైతులు తరలించారు.

కొల్లిపర మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు బాపట్ల జిల్లా పరిధిలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాలు, తీర ప్రాంత గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి దఫదఫాలుగా కురిసింది. పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో సుమారు ఇప్పటి వరకు 5 వేల ఎకరాలో కోతలు పూర్తి కాగా శనివారం చిరు జల్లులుతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ వర్షానికి గాలులు తోడవడంతో నిలువు మీద ఉన్న వరి పైరు నేలవాలింది. పంట కోసిన వారి వెతలు ఒకవిధంగా ఉంటే పొలంమీద ఉన్న పైరు నేలవాలి రైతులను మరింత కలవరపెడుతోంది. నేలవాలిన పైరు ఎక్కువ రోజులు కోయకుండా ఉంటే మొలకెత్తడంతో పాటు ధాన్యం రంగుమారుతుం దని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. శనివారం కురిసిన ఓ మోస్తరు వర్షంతో తుఫాన్ ప్రమాదం తప్పితే స్వల్ప నష్టంతో రైతులు బయట పడే అవకాశం ఉంది. భారీ వర్షాలు నమోదైతే మాత్రం అన్నదాతలు కోలుకోలేని విధంగా నష్ట పోవడం ఖాయం.

హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద సూచిక

రేపల్లె: తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంది. ఫెంగల తుఫాన్ కారణంగా శనివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని వెళ్ళినవారు ఒడ్డుకు చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. వేటకు వెళ్లిన బోట్లలో ఇప్పటికే 90 శాతం హార్బర్‌కు చేరుకున్నాయి.

పింఛన్లు.. చకచకా

- సర్వర్ స్పీడుతో 94 శాతానికి పైగానే
- ఉదయం 6 గంటలకే ప్రారంభం



చిలకలూరిపేటలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న పెమ్మసాని, లావు, ప్రతిపాటి

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సామాజిక పింఛన్లను ఠంచన్‌గా పంపిణీ చేస్తున్నది. డిసెంబరు నెలకు సంబంధించి పింఛన్లను ఒక రోజు ముందుగానే శనివారం పంపిణీ జరిగింది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తెలవారుతుండగానే లబ్ధిదారుడి ఇంటి తలుపుతట్టి మరీ నగదును సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఆ సమయంలో సర్వర్ స్పీడ్‌గా రెస్పాన్స్ కావడంతో చకాచకా పంపిణీని చేపట్టారు. సచివాలయ, ఇతర ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. ఒక్క రోజులోనే 94.62 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో 2లక్షల 54వేల 610మంది పింఛన్‌దారులుండగా వారిలో 2లక్షల 40వేల 920మంది పెన్షన్ నగదును అందుకున్నారు. జిల్లా మొత్తంగా రూ.102కోట్ల 81లక్షల 91వేల నగదుని పింఛన్‌దారులకు పంపిణీచేశారు. జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీల శ్రేణులు కూడా పంపిణీలో భాగస్వాములయ్యారు. ఒక్క రోజు ముందే పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. గత నెలలో పింఛన్ తీసుకోలేకపోయిన వారికి రెండు నెలలు కలిపి రూ.8వేల పింఛన్ నగదుని అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై మూడో నెలలకు ఒకసారి కూడా మొత్తం పింఛన్‌ని తీసుకోవచ్చని సచివాలయాల సెక్రెటరీలు తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఠంచన్‌గా ప్రతీ నెలా ఒకటో తేదీ, ఒకవేళ ఆ రోజు సెలవు అయితే ముందురోజే పింఛన్ పంపిణీ చేస్తుండటంపై పెన్షనర్లు ఆనందోత్సాహాలు వ్యక్తపరుస్తున్నారు.

- సీఐడీ కార్యాలయాన్ని పరిశీలించిన దర్యాప్తు అధికారి, ప్రకాశం ఎస్పీ దామోదర్

రఘురామ కేసు దర్యాప్తులో కదలిక

3వరకు రాయగడ ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకే

8

◆ ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు
◆ వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీరాచారవంతులు

రక్తికట్టిన రాచగావు



ఎర్రజెండాను ఎగురవేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవఅయ్యవారు



అలంకరించిన బ్రహ్మనాయుడు నృసింహకుంతం

6

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న జడ్పీ సీఈవో
- 2024-2025 వార్షిక సవరణ బడ్జెట్‌కు ఆమోదం

ఐఆర్ఈఎఫ్ కళాశాల బస్సు దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో బస్సులో 30 మంది విద్యార్థులు క్షేమం



వర్సిటీలో పర్యటిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు, కార్యదర్శి భరత్‌గుప్తాలు

విద్యార్థినుల ఆందోళనపై త్రిసభ్య కమిటీ

- తక్షణం స్పందించిన ప్రభుత్వం.. విచారణకు ఆదేశాలు
- నేటి మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ విచారణ
- వర్సిటీ వసతి గృహ హెడ్‌కుక్, కుక్‌ల సస్పెన్షన్

పెద కాకాని, నవంబ రు 30 (ఆంధ్రజ్యోతి): భోజనంలో పురుగులు, కప్పలు, జర్రెలు వస్తున్నా యని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యా ర్థినులు శుక్రవారం రాత్రి చేపట్టిన ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సీఎం ఆదేశాలతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు శని వారం వర్సిటీలో పర్యటిం చారు. విద్యార్థినుల వసతిగృహం, మెస్ గదులు, భోజనశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. వర్సి టీలోని ఉదంతంపై తక్షణమే విచారణ చేపట్టాలని త్రిసభ్య కమిటీని శనివారం నియమించింది. వాస్త వాలను విచారించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కమిటీలోని అధికారులు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, గుంటూరు డీఎస్‌వో పద్మజ, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రవీందర్ రెడ్డి శనివారం వర్సిటీలో పర్యటించారు. తొలుత వీసీ చాంబర్‌లో గంగాధర రావుతో సమావేశమ య్యారు. అనంతరం విద్యార్థినుల వసతి గృహాలకు వెళ్లి భోజనశాల, వంటగదులు, మరుగు దొడ్లను పరిశీలించి విద్యార్థి నులతో మాట్లాడారు. విద్యార్థినులు వారి సమస్యలను అధికారులకు తెలిపారు. భోజనం అపరిశుభ్రంగా ఉంటుందని, రుచి, సుచి లేకుండా ఉండటం వల్ల తినలేక పోతున్నామని చెప్పారు. వసతి గృహాల నిర్వహణ సరిగా లేదని, పరిసరాలు అపరిశుభ్రం గా ఉంటున్నాయని ఫిర్యాదు చేశారు. పిల్లులు ముట్టిన పాలు, పెరుగును వడ్డిస్తున్నారని తెలి పారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు, కల్తీ నూనెలు, నాసిరకం సరుకులు వంటకు వాడుతున్నారన్నారు. వర్సిటీలో విద్యార్థినుల ఇబ్బందులు, వారి సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యార్థినుల వసతి గృహంలోని రీడింగ్ రూమ్‌లో విచారణ చేపట్టనున్నట్లు విచారణ అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా విలేకరులకు తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ విద్యార్థునుల ఆందోళనల నేపథ్యంలో వారి ఇబ్బందులు, సమస్యలను తెలుసుకునేందుకు బహిరంగ విచారణను చేపడుతున్నామన్నారు. గతంలో అనేక మార్లు ఫిర్యాదులు చేసినా వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని విద్యార్థినులు ఫిర్యాదు చేశారని తెలిపారు. పై విషయాలన్నిటిపై విద్యార్థినుల అభిప్రాయాలను తెలుసుకుని సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కమిటీ వెంట గుంటూరు ఆర్డీవో కమ్మ శ్రీనివాసరావు, పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్, ఇతర అధికారులు ఉన్నారు.

సిబ్బందిపై వేటుతో సరి

వర్సిటీలోని మెస్‌లో తయారు చేసే భోజనంలో పురుగులు రావడం, వంట అశుభ్రంగా ఉండటంపై స్పందించిన వర్సిటీ అధికారులు విద్యార్థినుల వసతి గృహ హెడ్ కుక్, కుక్‌లను సస్పెండ్ చేశారు. చీఫ్ వార్డెన్ వెంకటరత్నంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ఏమిటని వర్సిటీ వర్గాలు ఆశ్చర్య పోతున్నాయి.



వర్సిటీలో విద్యార్థినుల హాస్టల్లో పరిశీలన చేస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా

జుత్తుపై రూ.60వేల కోట్ల వ్యాపారం

- ఐఏడీవీఎల్ సైంటిఫిక్ సెషన్‌లో 'ఆశ్రమ్' ప్రొఫెసర్ సుబ్బారావు

గుంటూరు మెడికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జుత్తుపై ఏటా రూ.60వేల కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు అల్లూరి సీతారామరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆశ్రమ్) డీవీఎల్ ప్రొఫెసర్ డీ సుబ్బారావు తెలిపారు. శనివారం గుంటూరులో ప్రారంభమైన ఏపీ చర్మవ్యాధుల వైద్యనిపుణుల సంఘం 43వ వార్షిక సదస్సులో 'ట్రైకాలజీ క్లినిక్‌లో నా అనుభవాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. తొలుత ఐఏడీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మజుందార్ షినోయ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో ప్రొఫెసర్ సుబ్బారావు, సీ శోభనాద్రి స్మారక ప్రసంగంలో మాట్లాడారు. జుత్తు తెల్లబడితే నలుపుగా మార్చుకునేందుకు వాడే డయ్యర్ల నుంచి జుత్తును కొత్తగా మొలిపించే పీఆర్‌పీ చికిత్సల వరకు ఏటా వేల కోట్ల వ్యాపారం సాగుతున్నట్లు తెలిపారు. షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి వ్యాధుల వల్ల స్త్రీల్లో, మగవారిలో జుత్తు రాలడం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. చర్మవ్యాధుల వైద్యనిపుణుల సంఘం (ఐఏ డీవీఎల్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మజుందార్ షినోయ్ మాట్లాడుతూ కొవిడ్ మహమ్మారి తర్వాత పలు రకాల కొత్త ఫంగల్ వ్యాధులు వెలుగు చూస్తున్నట్లు తెలిపారు. ఫంగస్‌లు మ్యుటేషన్లకు గురై తీవ్రమైన కొత్త వ్యాధులను కలిగిస్తున్నాయని చెప్పారు.

కృత్రిమ మేధతో అద్భుతాలు..

ఆధునిక కృత్రిమమేధ సాంకేతిక పరిజ్ఞానం చర్మవ్యాధుల వైద్యరంగంలోనూ ప్రవేశించి అద్భుతాలు చేస్తున్నట్లు ఎయిమ్స్, న్యూఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సోమేష్ గుప్తా తెలిపారు. స్కిన్ జీపీటీ, చాట్ జీపీటీ వంటివి విరివిగా వినియోగించే రోజులు దగ్గరలోనే ఉన్నట్లు తెలిపారు. ఐఏ డీవీఎల్ జాతీయ సెక్రటరి డాక్టర్ భూమేష్ కుమార్ కటకం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన చర్మమే ఆరోగ్యకరమైన దేహమన్నారు. కార్యక్రమంలో ఏపీ చర్మవ్యాధుల వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జే సౌజన్య, సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేఏ సీతారామ్, డాక్టర్ నిరుపమ, డాక్టర్ కే నాగేశ్వరరావు, డాక్టర్ టీఎస్ మోహన్‌రావు తదిత రులు పాల్గొన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ డీఎస్ ఎస్ శ్రీనివాస ప్రసాద్ వ్యవహరించారు. మెడికల్ పీజీ విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. మెడికల్ పీజీ విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహిస్తున్నారు.



ప్రొఫెసర్ సుబ్బారావును సన్మానిస్తున్న వైద్యులు

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి రెండు అదనపు 3ఏసీ బోగీలు

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి పది రోజుల పాటు రెండు అదనపు 3ఏసీ బోగీలను జోడిస్తున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు బెంగళూరు సిటీ వైపు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి, డిసెంబరు 2 నుంచి 11వ తేదీ వరకు భువనేశ్వర్ వైపునకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి అదనపు త్రీటైర్ ఏసీ బోగీలు జత చేస్తామన్నారు. అలానే డిసెంబరు 6 నుంచి 27వ తేదీ వరకు పూరీ - యశ్వంత్‌పూర్, డిసెంబరు 7 నుంచి 28వ తేదీ వరకు యశ్వంత్‌పూర్ - పూరీ ఎక్స్‌ప్రెస్‌కు ఒక త్రీఏసీ ఎకానమి బోగీని జత చేస్తామన్నారు.

వంటలో నాణ్యతా లోపాలు

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్లో చేస్తున్న వంటలో నాణ్యత లోపాలు ఉన్నాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు తెలిపారు. వర్సిటీలో విద్యార్థినుల ఆందోళనపై సమగ్ర విచారణ జరిపేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు వర్సిటీకి వచ్చారు. శనివారం వర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్ గదులు, మెస్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థినిలకు సంబంధించిన భోజనశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినుల భోజనశాలలో అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనినే ప్రాథమిక విచారణ కింద చేపట్టి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి భరత్ గుప్తా, గుంటూరు ఆర్డీవో కమ్మ శ్రీనివాసరావు, పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

అన్నంలో కప్పలు.. జెర్రులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల హాస్టల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. భోజనం బాగోటలేదనీ, అన్నంలో పురుగులు, జెర్రులు, ఈగలు ఉంటున్నాయని విద్యార్థినులు 20 రోజుల క్రితమే వర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారి గోడు పట్టించుకోలేదు. పైగా ఎవరైతే ఫిర్యాదు చేశారో వారిపై వర్సిటీ ఉన్నతాధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా భోజనం సక్రమంగా లేదని పస్తులు ఉంటున్నారు. గత్యంతరం లేక విద్యార్థినులు ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ప్రభుత్వ విచారణ కమిటీ ముందు విచారణకు సైతం విద్యార్థినులు ఎవరూ హాజరు కావద్దని, కొంతమంది మాత్రమే వచ్చి అంతా బాగా ఉందని చెబుతారనీ, ఎవరైతే మా ఆదేశాలు పాటించకుండా వ్యవహరిస్తారో వారిని అన్ని విధాలుగా పరీక్షలు తప్పిస్తామని ఉన్నతాధికారి బెదిరిస్తున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. నేడు తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ విచారణకు వర్సిటీలోని హాస్టల్ విద్యార్థినులు ఎవరూ హాజరు కావద్దని ఆయా విభాగ అధిపతులు విద్యార్థినులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో కమిటీ ముందు వాస్తవాలు వెల్లడించేందుకు వెనకడుగు చేస్తున్నట్టు తెలిసింది.

బయట ఆహారం కోసమే ఆందోళన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో భోజనం బాగోలేదు అని విద్యార్థులు ఆందోళన చేపట్టారనీ, అందుకు ప్రధాన కారణం బయట ఫుడ్‌కు అనుమతి ఇవ్వమంటున్నారని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బయట ఫుడ్ కోసమే విద్యార్థినులు ఆందోళన చేపడుతున్నారని ఆయన తెలిపారు. అయితే బయట ఆహారానికి కూడా అనుమతిస్తున్నామని, ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8:30 వరకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. అది కూడా పార్సిల్ తెచ్చిన వారిని లోపలికి అనుమతి ఇవ్వకుండా, కేవలం గేటు వద్ద సెక్యూరిటీ వారికి అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినిలు చెబుతున్నట్లు భోజనంలో పురుగులు వచ్చినట్లు మా వద్ద కూడా సాక్ష్యాలు ఉన్నాయని, కానీ జెర్రీలు, కప్పలు వచ్చినట్లు ఆధారాలు లేవన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో ముగిసిన జాతీయస్థాయి సదస్సు

- పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్‌సైక్లింగ్ సహాయంతో ప్లాస్టిక్‌ను క్రియేటివ్‌గా మార్చి అధిక విలువ కలిగిన వస్తువులుగా తయారు చేయడం వలన పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు కూడా దోహదం చేస్తుందని ఐఐఎస్‌సీ బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ ఆచార్య సూర్యసారథి బోస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్బ్ ఇండియా ఏఎన్ఆర్ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌సీఎఫ్‌పీఎస్‌టీ-2024)' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సు శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య సూర్యసారథి బోస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ వలన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించి సమీప ప్రదేశాలను శుభ్రంగా ఉంచే అవకాశం ఉందన్నారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని హెచ్ఈఎంఆర్ఎల్ డీఆర్‌డీవో సైంటిస్ డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ హైఎనర్జీ మెటీరియల్స్‌లో రసాయన సంక్లిష్టతలు గుణాత్మకంగా డిజైన్ చేయడం ద్వారా తక్కువ పరిమాణంలో ఎక్కువ శక్తిని విడుదల చేయగల సామర్థ్యం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో వేలూరులోని తిరువల్లువర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ డైరక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, హెడ్ కే.దినకరన్, హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ కేఎస్ఎన్.రాజు, విశాఖపట్నంలోని ఐఐపీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్త చందలూరి, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆచార్య సూర్యసారథి బోస్

ఐఆర్ఈఎఫ్ కళాశాల బస్సు దగ్ధం

- బస్సులో 30 మంది విద్యార్థులు
- డ్రైవర్ అప్రమత్తతతో క్షేమం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

రేపల్లె-చెరుకుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్టుసర్క్యూట్ కారణంగా ఐఆర్ఈఎఫ్ కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు చెరుకుపల్లిమండలం గూడవల్లి వద్ద దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తమై బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు దింపారు. దీంతో పెనుప్రమాదం నుంచి బయటపడ్డామంటూ విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. రేపల్లె పట్టణంలోని 19వ వార్డులోని ఐఆర్ఈఎఫ్ (ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్)కు చెందిన కళాశాల బస్సు శనివారం ఉదయం నర్సింగ్ విద్యార్థులకు రాత పరీక్షల నిమిత్తం గుంటూరుకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సులో 30 మంది విద్యార్థినులు ఉన్నారు. గూడవల్లి సమీపంలోకి వచ్చేసరికి బస్సులో పొగలు కమ్మేయ్యటంతో డ్రైవర్ మేరుగశ్యామ్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి విద్యార్థులను కిందకు దింపారు. బస్సులో ఒక్కసారిగా శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. స్థానికులు గోగినేని కృష్ణ, రావిపాటి సీతారామయ్య మరికొందరు స్థానికులతో కలసి బస్సులో మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇంతలో రేపల్లె నుంచి ఫైర్ ఇంజన్ రావటంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న నర్సింగ్ విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. సమాచారం తెలిసిన విద్యార్థినుల తల్లిదండ్రులు గూడవల్లికి చేరుకుని తమ పిల్లలను చూసుకుని ఊపిరి పీల్చుకున్నారు. కండీషన్‌లోలేని బస్సులు తిప్పటం వలనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీస మరమ్మతులు నిర్వహించకుండా 30 మందిని ఎక్కించుకుని గుంటూరు తరలించటం యాజమాన్యం నిర్లక్ష్య ధోరణియేనని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు. సాంకేతిక లోపాలు, షార్టుసర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫైర్ ఆఫీసర్ సాంబశివరావు తెలిపారు. దీనిపై చెరుకుపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



గూడవల్లివద్ద దగ్ధమవుతున్న కళాశాల బస్సు

అధికారుల గైర్హాజరుపై జడ్పీ ఆగ్రహం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న సీఈవో
- 2024-2025 వార్షిక సవరణ బడ్జెట్‌కు ఆమోదం

గుంటూరు సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్య వ్యవహార శైలిపై శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన స్థాయి సంఘాల సమావేశంలో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. అధికారులు రానప్పుడు ఈ సమావేశాలు ఏర్పాటు చేయటం ఎందుకు అన్న భావన చైర్‌పర్సన్‌తోపాటు, జడ్పీ టీసీలలో కలిగింది. చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆదేశాలతో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పరిషత్ మీటింగ్‌లను ఉద్దేశ పూర్వకంగా బహిష్కరిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈలపై రాష్ట్ర ఈఎన్‌సీకి ఫిర్యాదు చేస్తామని సీఈవో వెల్లడించారు. చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆధ్వర్యంలో జరిగిన మొదటి స్థాయి సంఘ సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక అంశాలపై చర్చ జరిగింది. 2024-2025 సంవత్సరానికిగానూ సవరణ బడ్జెట్‌లో రాబడి రూ. 64,02,07,000 గా ఉండగా, ఖర్చు రూ. 62,21,77,000 గా ఉండగా, మిగులు బడ్జెట్ రూ. 1,80,30,000 చూపించారు. ఈ సమావేశంలో జడ్పీ భూముల లీజు వ్యవహారంపై కొద్దిసేపు చర్చ జరిగింది.

వేలం పాటకు మమ్మల్ని పిలవరా...

అచ్చంపేట మండలం కొత్తపల్లి, తాళ్లచెరువులో జిల్లా పరిషత్‌కు చెందిన 3.78 సెంట్ల వ్యవసాయ భూమి లీజు వ్యవహారంలో అక్కడి జడ్పీ టీసీ తుమ్మా విజయప్రతాప్ రెడ్డి సమావేశంలో మాట్లాడారు. వేలం వేసేటప్పుడు సమాచారం అందించకపోవడం దారుణమన్నారు. దానిపై జడ్పీచైర్ పర్సన్, సీఈఓ జోక్యం చేసుకుని ఇక మీదట జడ్పీటీసీని వేలం పాటకు ఆహ్వానించేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు టోల్ ప్లాజా వద్ద నున్న జడ్పీ స్థలం విషయంలో అక్కడి జడ్పీ టీసీ జంగా కోటయ్య ప్రస్తావించారు. గుంటూరు డ్వామా పీడీ వి.శంకర్ మాట్లాడుతూ జిల్లాలో 15 గ్రామీణ మండలాల్లో 29 లక్షల పని దినాలు లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ఇళ్ల పన్నుల వివరాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులో కి తెచ్చిందని జిల్లా పంచాయతీ అధికారి సాయి తెలిపారు. జడ్పీటీసీలకు గౌరవ వేతనం పెంచే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సభ్యులు కోరారు. హెన్రీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో వివిధ స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి.



సమావేశంలో చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, సీఈవో జ్యోతి బసు

నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డు

తాడికొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డు లభించిందని కళాశాల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం నాదెండ్ల రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డుకు సంబంధించిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఫార్మా విద్యారంగంలో, పరిశోధనా రంగంలో ఉత్తమ ప్రతిభ చాటినందుకు అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఫార్మసీ(ఏబీఏపీ) వారు సీనియర్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించిందని తెలిపారు. డిసెంబరు 19,20,21 తేదీల్లో ఉత్తరప్రదేశ్ మాంగల్యధాన్ యూనివర్సిటీలో నిర్వహించే 18వ వార్షిక వేడుకల్లో అవార్డును అందజేస్తారని తెలిపారు. రామారావు ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 200కు పైగా పరిశోధన పత్రాలను ప్రచురించి, 7 పుస్తకాలను రచించి, 3 పేటెంట్లను సొంత చేసుకున్నారని తెలిపారు. రామారావును కళాశాల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, అభినందించారు.



ఉత్తమ సైంటిస్ట్ ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఆంజనేయులు, సుజిత్‌కుమార్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సబ్ స్టేషన్‌పరిధిలోని విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ ఫేజ్ 1, 2 తో పాటు 3, 4 ఫీడర్స్ పరిధిలోని విశ్వనాథ్ హోటల్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, హెచ్‌బీ పెట్రోల్ బంకు ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గం టల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు జిల్లా స్థాయి సీనియర్ బాస్కెట్ బాల్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూ అసోసియేషన్ గుంటూరు డిస్ట్రిక్ బాస్కెట్ బాల్ ఆధ్వర్యంలో స్థానిక అంకిరెడ్డి పాలెంలో మహిళలు, పురుషుల విభాగాల్లో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ బాస్కెట్ బాల్ ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీ రేవతి, జీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు తమ పాస్ పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7న మార్టూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 98663 34528 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బ్రెయిలీ ప్రెస్ పనితీరుపై విచారణ

గుంటూరు(విద్య),నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని ప్రభుత్వ బ్రెయిలీ ప్రెస్ పనితీరుపై శనివారం డీసీవో వీరాచారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఇక్కడ ప్రెస్‌లో ఉద్యోగులు సక్రమంగా పనిచేయని ఫలితంగా ప్రింటింగ్‌కు వచ్చిన ఆర్డర్లు సకాలంలో అందించడం లేదని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు కొంతమంది దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఫిర్యాదులపై విచారణ నిర్వహించాలని జేసీ భార్గవ్‌తేజ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసిన వారిని పిలిపించి విచారించే కార్యక్రమం ప్రారంభించామని డీసీవో తెలిపారు. జేసీకు నివేదికను త్వరలో అందిజేస్తామని అన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

గుంటూరు(విద్య),నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని స్కిల్‌హబ్ ద్వారా డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులకు డిసెంబరు 4 నుంచి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు పది, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని వివరించారు. ఇతర వివరాల కోసం 6304292828 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కమ్యుటేషన్ గరిష్ట కాలపరిమితి తగ్గింపుపై హర్షం

గుంటూరు(తూర్పు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, విశ్రాంతి ఉద్యోగులకు కమ్యుటేషన్ గరిష్ట కాలపరిమితి 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా హర్షం వ్యక్తం చేశారు. దీంతో, రాష్ట్రంలో సుమారుగా 45 వేల మంది ప్రభుత్వ పెన్షన్ దారులకు, విశ్రాంత ఉద్యోగులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కీర్తనలను ఆలపిస్తున్న అంజనీదేవి తదితరులు

అలరించిన శివ కీర్తనల గానం

గుంటూరు(తూర్పు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతలపాటి రమాగోపాలకృష్ణ బృందం శనివారం శివుని కీర్తనల గానం చేశారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సామవేదం షణ్ముఖశర్మ రచించిన శివపదంలోని శివుని కీర్తనలను గాయనీమణులు రమా గోపాలకృష్ణ, అంజనీదేవి, నాగలక్ష్మి, పావని ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశర్మ, తబలాపై బాలజీ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం గాయనీమణులను జ్ఞాపికలతో సత్కరించారు.

కొత్తపేట శివాలయంలో సహస్ర జ్యోతిర్లాంగార్చన

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని బాలా త్రిపుర సుందరీ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం ముగింపు పురస్కరించుకొని ఆలయ అర్చకులు, పురోహితుల ఆధ్వర్యంలో సహస్ర జ్యోతిర్లాంగార్చన కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో మహన్యాస పూర్వ రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన కార్యక్రమాలతో విశేష పూజలు చేశారు.

నేటి నుంచి దీక్షా స్వాములకు 'అన్న సమారాధన'

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట 4/4లోని శివాలయంలో ఆదివారం నుంచి అయ్యప్ప దీక్షా స్వాములకు అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అయ్యప్పసేవా సమాఖ్య అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ శర్మ తెలిపారు. ఈ అన్న సమారాధన జనవరి 10 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు సద్ది(భోజనం) కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంట నుండి ప్రారంభమవుతుందన్నారు. అయ్యప్పలు, దీక్షా స్వాములు వినియోగించుకోవాలని సూచించారు.

పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం నగర పాలక సంస్థ సహకారంతో మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్‌స్టేడియంలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తగా 100 చెత్త సేకరణ వాహనాలను ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, మాధవి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ చెత్త సేకరణకు చిన్న వీధుల్లోకి ఆటోలు పూర్తి స్థాయిలో వెళ్ళడం లేదని గుర్తించానని, చెత్త సేకరణ బండ్లు అయితే ప్రతి ఇంటి నుండి నేరుగా చెత్త సేకరణ సులభమని భావించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. 'మీతోనే నేను- మీ వెంటే నేను' కార్య క్రమం ద్వారా అనేక డివిజన్‌లలో పర్యటించినప్పుడు తనకు పారిశుధ్య సమస్యలే స్వాగతము పలికాయని, పారిశుధ్యంపై యుద్ధం ప్రకటించాలన్న లక్ష్యంతో 'స్పెషల్ శానిటరీ డ్రైవ్' నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు.

జాతిని నిర్మించే వారే అకౌంటెంట్లు

అకౌంటెంట్లు అంటే నంబర్ బిల్డ్ చేసే వారు కాదని, నేషన్ బిల్డ్ చేసే వాళ్ళు అని వారు నిరూపించారని కేంద్ర గ్రామీణాభి వృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక రింగురోడ్డులోని కొమ్మినేని గార్డెన్స్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్' అం శంపై ఒక్కరోజు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ నిజాయితీ పరులకు తప్పుచేస్తే నిద్ర కూడా పట్టదు కానీ, కొందరు ఆడిటర్ల ముసుగులో ఉన్న నాయకులు అన్యాయాలు చేస్తూ బతుకుతారని విమర్శించారు. ఆడిటర్లు విన్న వించిన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, ఏపీ టీపీసీఏ చైర్మన్లు వై శ్రీనివాస శేష సాయిబాబు, బిఎస్ సీతాపతి రావు పాటు ప్రెసిడెంట్ దామచర్ల శ్రీనివాస రావు, వైస్ ప్రెసిడెంట్ టి చంద్రమౌళి, బి శ్రీనివాసరావు, అడ్వైజర్స్ షరీఫ్ ఖాన్, బిపిఆర్ కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణరాజు, సెక్రటరీ కేవీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తి భావం పెంపొందించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భావి తరాల్లో భక్తి భావాన్ని పెంపొందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తానా, దర్శనం టీవీ ఛానల్, సిటీ కేబుల్ సంయుక్త ఆధ్వర్యంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలో శనివారం సహస్ర గళార్చన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ నేటి తరం యువత సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దగ్గర కావాలని సూచించారు.

అన్నమయ్య సంకీర్తనల మేళవింపుతో సహస్ర గళార్చన కార్యక్రమం శ్రవణానందంగా సాగింది. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కోలా అశోక్‌బాబు, సిటీ కేబుల్ ఎండి కృష్ణమోహన్, శ్రీ విద్యా ఉపాసకులు బ్రహ్మశ్రీ జయశంకర్ శిష్ట పాల్గొన్నారు.



పుష్ కాట్లను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు



దివ్యాంగ మహిళకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక 33వ డివిజన్‌లోని దేవాపురం, 34వ డివిజన్‌లోని ఫాతిమాపురంలో శనివారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక రోజు ముందుగానే పింఛన్లు అందడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఈరాంటి వర ప్రసాద్, పోపూరి నరేంద్ర, దగ్గు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఛిద్రమైన రోడ్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహర్దశ తీసుకొస్తున్నామని, గుంటూరులో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు.. స్థానిక నెహ్రూనగర్ రూ.74 లక్షలతో సీసీ రోడ్డు, 7.5 లక్షలతో సీసీరోడ్డు, డ్రైన్, వల్లూరివారితోటలో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరులోని ఆర్‌ఓబీల నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేముల కొండ శ్రీనివాస్, బత్తిని శంకర్, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

● అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్

అర్హత వున్న ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం పింఛన్ అందిస్తుందని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో శనివారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం 6 గంటలకె నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వద్దకు వెళ్లి పింఛను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ ముప్పరపు భారతి, చిట్టా బత్తిన చిట్టిబాబు, మహంకాళి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయసమావేశం

ఆత్మవిశ్వాసంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని దివ్యాంగులు నిరూపిస్తున్నారని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు. స్థానిక నగరంపాలెంలోని ఎన్జీవో కళ్యాణమండపంలో దివ్యాంగ ఉద్యోగులు శనివారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఉద్యోగులను సత్కరించారు.



ఆత్మీయ సమావేశంలో నసీర్, గోనుగుంట్ల

ఆత్మవిశ్వాసమే దివ్యాంగుల బలం

దివ్యాంగుల అసమాన ప్రతి భకు వారి ఆత్మవిశ్వాసమే బల మని, అలాంటి వ్యక్తుల ప్రతి భకు ప్రతి ఒక్కరూ గౌరవం చూపాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథా లయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు, దేవనబోయిన ఎల్లయ్య, కుమార్ రాజా, గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కే లక్ష్మి, పాల్గొన్న ఆశా వర్కర్లు

పెన్షన్ పంపిణీ విధుల నుంచి 'ఆశా'లను తప్పించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు సామాజిక పెన్షన్ పంపిణీ బాధ్యతను రద్దు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కే లక్ష్మి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు టీ ధనలక్ష్మి అధ్యక్షతన స్థానిక పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశా వర్కర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయలేదని విమర్శించారు. ఫిబ్రవరి 9న రాష్ట్ర అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన మినిట్స్ లో పేర్కొన్న అంశాలకు జీవోలు విడుదల చేయాల్సి ఉండగా వాటిని పక్కనపెట్టి అనేక సంవత్సరాలుగా వైధవ్య పెన్షన్ పొందుతున్న ఆశా వర్కర్లకు పెన్షన్ రద్దు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వై నేతాజీ, పీ ధనలక్ష్మి, కే జ్యోతి, జయప్రద, టాన్యా తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఆర్ఎం కప్ ఫైనల్ మ్యాచ్

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్-2024లో భాగంగా క్రికెట్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ ఆదివారం నల్లపాడులోని రైల్‌విహార్‌లో జరుగుతుందని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. శనివారం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లలో గుంటూరు ఎస్పీ జట్టు, పల్నాడు ఎస్పీ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. రెండో సెమీఫైనల్స్‌లో డీఆర్ఎం లెవన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో బాపట్ల ఎస్పీ జట్టుపై గెలుపొందింది. ఆదివారం డీఆర్ఎం లెవన్, గుంటూరు ఎస్పీ జట్ల మధ్యన ఫైనల్స్ మ్యాచ్ జరుగుతుంది. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



పోటీల్లో గెలుపొందిన విజేతలతో ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా 'చిప్స్' విద్యార్థులు

గుంటూరు(విద్య),నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరావుపేటలోని నిప్స్ ఫార్మసీలో జరిగిన పోటీల్లో చిప్స్ కళాశాల విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, ఉమెన్ రన్నింగ్‌లో తదితర విభాగాల్లో ప్రథమ స్థానంలో ఉమెన్ కబడ్డీ, లాంగ్ జంప్‌లో ద్వితీయ సానం సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ రాపాటి శ్రీనివాస్, డాక్టర్ సీఎస్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



రైతు నేస్తం కార్యాలయాన్ని సందర్శించిన ఎస్ఆర్ఎం విద్యార్థులు

చిరుధాన్యాలతో ఆరోగ్యకర జీవనం

● రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

మంగళగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, అరికెలతో తయారు చేసిన ఆహారంతో ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని గుంటూరు రైతు ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు శనివారం కొర్నెపాడులోని రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. గోవుల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ, వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్పత్తుల తయారీ గురించి విద్యార్థులకు వివరించారు. దేశ వ్యాప్తంగా చిరుధాన్యాలపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మిల్లెట్ రాంబాబు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వందన స్వామి, రైతు ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాంబశివరావు, ఎస్ఆర్ఎం మీడియా మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో పరిశుభ్రమైన బెడ్‌రోల్స్ సరఫరా చేస్తున్నాం

● వదంతులు నమ్మొద్దు ● సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ విజ్ఞప్తి

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ నుంచి బయలుదేరే నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ బోగీలలో ప్రయాణీకులకు పరిశుభ్రమైన బెడ్‌రోల్స్‌ని సరఫరా చేస్తున్నామని రైల్వే సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ స్పష్టం చేశారు. కొంతమంది సోషల్‌మీడియాలో రెండు నెలలకు శుభ్రం చేసే బెడ్‌రోల్స్ ఇస్తున్నారని పెడుతున్న పోస్టింగ్‌లపై ఆయన స్పందించారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు శనివారం రైల్ వికాస్ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ డీసీఎం మాట్లాడుతూ గుంటూరు నుంచి నంబరు 17261, 17243, 17251, 17253 రైళ్లు బయలుదేరతాయన్నారు. వీటిల్లో ఏసీ బోగీల్లో ప్రయాణించే ప్రయాణికులకు రెండు బెడ్‌షీట్లు, ఒక దిండు కవర్, మరో టవల్‌ని అందిస్తామన్నారు. ఇవీ ప్రతీ ట్రిప్‌కి వాషింగ్ చేసినవే ఇస్తామన్నారు. కింద వేసే మందపాటి బ్లాంకెట్‌ని మాత్రం రైల్వే నిబంధనల ప్రకారం నెలకొకసారి వాషింగ్‌కి పంపడం జరుగుతుందన్నారు. మెకనైజ్డ్ లాండ్రీలో శుభ్రం చేసి వాటిని ఇస్త్రీ చేసిన తర్వాతే ప్రయాణికులకు అందజేస్తామన్నారు. ఈ విషయంలో ఎలాంటి వదంతులను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ మద్దాళి రవికిరణ్, ఏడీఎంఈ బాపయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాలమహానాడు నాయకులు అరుణ్‌కుమార్, హేమప్రసాద్, జాన్‌పాల్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడితే పార్లమెంట్‌ను ముట్టడిస్తాం

● రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాజ్యాంగ విరుద్ధం

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీలను విభజించి కుట్ర చేసేలా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడితే పార్లమెంటును ముట్టడిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. గుంటూరులోని సంఘం కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఎస్సీ లోని 59 ఉప కులాలకు ఉమ్మడి హక్కుల రిజర్వేషన్లను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎమ్ఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణకు మద్దతుగా ఎస్సీలను విభజించే కుట్రకు పన్నాగం పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రిజర్వేషన్స్ ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని హెచ్చరించారు. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మద్దతు తెలపటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాజ్యాంగ విరుద్ధమని ధ్వజమెత్తారు. ఆ కమిషన్‌కు ఎస్సీలను అధ్యయనం చేసే అధికారం లేదన్నారు. కమిషన్‌ను రాష్ట్రంలో తిరగనివ్వబోమని, ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. త్వరలో అన్ని మాల సంఘాలతో రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దార హేమప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్ పాల్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రు విజయ్, పట్టణ కార్యదర్శి యేచూరి వేణు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఉన్న వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయిన్ బాషా డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ నుంచి కలెక్టరేట్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైసీపీ నాయకుల ఒత్తిడితో రాజీనామా చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, గత ఆరునెలలుగా ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మస్తాన్‌బీ, ఆంజనేయులు, అవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పసిబిడ్డతో.. గుంటూరు కానిస్టేబుల్

● అనంతలో సీఎం చంద్రబాబు సభకు భద్రతా విధులు

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా నేమకల్లులో జరిగిన సీఎం చంద్రబాబు సభకు భద్రతా విధుల్లో గుంటూరుకు చెందిన కానిస్టేబుల్ భువనేశ్వరి పాల్గొన్నారు. పసివాడైన తన కుమారుడిని ఎత్తుకుని ఆమె విధుల్లో పాల్గొన్నారు. నిద్రపోతున్న మూడేళ్ల కుమారుడిని గుండెలపై పడుకోబెట్టుకుని ప్రజా వేదిక సభలో విధులు నిర్వర్తించారు. తన భర్త ప్రమాదంలో గాయ పడ్డారని, ఆయనకు ఇబ్బంది కలగకుండా కుమారుడిని వెంట తెచ్చుకున్నానని తెలిపారు. తన కూతురు, భర్త గుంటూరులో ఇంటి వద్ద ఉన్నారని తెలిపారు.



కుమారుడితో కానిస్టేబుల్ భువనేశ్వరి

మోసగించిన కమీషన్ వ్యాపారి దర్జాగా యార్డులోకి !

● మిర్చి వ్యాపారస్తులకు రూ. 30 కోట్లు ఎగ్గొట్టిన వైనం

● పోలీసులకు ఫిర్యాదు చేయని అధికారులు

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం మిర్చియార్డులో నమ్మకంగా ఎగుమతి వ్యాపారస్తులను నిట్టనిలువునా మోసగించిన కమీషన్ వ్యాపారి దర్జాగా శనివారం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రత్యక్షమయ్యారు. అయినప్పటికీ అధికారులు పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి. మిర్చియార్డులో గోపు శ్రీనివాసరెడ్డి, ఆయన భాగస్వామి కిశోర్‌రెడ్డి కమీషన్ వ్యాపారం చేస్తున్నారు. ఎక్స్‌పోర్టర్లతో పాటు కొంతమంది రైతుల వద్ద వీళ్లు దాదాపుగా రూ. 30 కోట్లు అప్పులు చేసినట్లు తేలింది. దీనిపై మార్కెట్ కమిటీకి ఫిర్యాదులు రావడంతో శ్రీనివాసరెడ్డి లైసెన్సుని నిలుపుదల చేశారు. అతను ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఒక మాజీ నాయకుడిని ఆశ్రయించి అధికారులపై ఒత్తిడి చేసి హోల్డ్‌లో పెట్టిన లైసెన్సుని రిలీజ్ చేసుకొనే ప్రయత్నాలను ప్రారంభించారు. ఎవరైనా ఎక్స్‌పోర్టర్లు ప్రశ్నిస్తే తాను ఎవరికి బాకీ చెల్లించాల్సిన పనిలేదని చెబుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ అధి కారులు అతనిపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయరని ఎక్స్‌పోర్టర్లు ప్రశ్నిస్తున్నారు.

'ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ న్యాయసమ్మతమైనదే'

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్ న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనదని ఆంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రత్యేక హోదా - హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు ధర్మం కాదు అనే అంశంపై శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మబద్ధమైన ప్రత్యేక హోదాను సాధించుకోవటానికి ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రజలకు మరింత నిరాశకు గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట స్టేషన్ పరిధిలోని తూనుగుంట్ల వారి వీధికి చెందిన జవ్వాది సౌజన్య (40) అనే మహిళ అదృశ్యమైంది. అక్టోబరు 15న ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్ళ వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీసులకు తెలియజేయాలని పోలీసులు కోరారు.



జవ్వాది సౌజన్య (ఫైల్)

స్పీడ్ బైక్స్ యువకులకు కౌన్సెలింగ్

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్పీడ్ బైక్స్ యువకులకు ట్రాఫిక్ పోలీసులు వారి తల్లిదండ్రుల సమక్షంలో శనివారం కౌన్సె లింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వారికి స్పీడ్ బైక్స్ ఇవ్వవద్దని సూచించారు. కాగా, స్థానిక లక్ష్మీపురం యూనియన్ బ్యాంక్ సెంటర్‌లో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 20 ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయి.



పట్టుబడిన యువకులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, వెస్ట్ సీఐ సింగయ్య

చంద్రమౌళినగర్‌లో చైన్ స్నాచింగ్

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్ 7/3 లో శనివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. సీఐ వీరేంద్రబాబు కథనం మేరకు, చంద్రమౌళినగర్ 7/2కు చెందిన మహిళ కొడాలి విజయలక్ష్మి డ్రై ఫ్రూట్స్ కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై వెళుతోంది. చంద్రమౌళినగర్ 7/3 వద్దకు వచ్చేసరికి ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ అగంతకుడు ఆమె మెడలోని గొలుసు తెంపుకుని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


డాక్టర్ బెదిరింపులతో పురుగుమందు తాగిన మహిళ మృతి

నరసరావుపేటకు చెందిన ఓ వైద్యుడు బెదిరింపు కారణంగా కేసాని పద్మజ (50) అనే మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేటకు చెందిన కేసాని వెంకట సాయిరాం అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మూడేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లి పద్మజ మరో ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. అయితే, పద్మజ పనిచేస్తున్న ఆసుపత్రి మూసివేయడంతో ఆమె కూడా తన కుమారుడు పనిచేస్తున్న ఆసుపత్రిలో గడిచిన 11 నెలలుగా నర్స్ గా పని చేస్తోంది. అయితే, సాయిరాం భార్యకు గుంటూరులో హెడ్ నర్స్ గా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ప్రతిరోజు నరసరావుపేట నుంచి గుంటూరు వచ్చి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండడంతో తల్లి, కుమారుడు అక్కడ ఆసుపత్రిలో ఉద్యోగం మానేసి కుటుంబాన్ని గుంటూరు మారుతీనగర్ మూడో లైనుకు మార్చారు. అయితే, తన ఆసుపత్రిలో సాయి రామ్ మానేయడానికి వీల్లేదని అక్కడి ఆసుపత్రి వైద్యులు హెచ్చరించారు. అంతేగాక ఆసుపత్రిలో రూ.50 లక్షలకు తప్పుడు లెక్కలు రాశావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించారు. ఆ బెదిరింపులకు భయపడిన పద్మజ 25వ తేదీన ఎలుకల మందు పేస్టు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఎవరికీ చెప్పలేదు. 29న పద్మజకు కడుపునొప్పి రావడంతో బాపట్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉండడంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె శనివారం ఉదయం మృతి చెందింది. సాయిరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డేంజర్ మొబైల్స్

● కాలక్షేపంతో కాలహరణ



● షార్ట్స్, రీల్స్‌కు బానిసలు అవుతున్న యువత ● మెదడుపై తీవ్ర ప్రభావం తప్పదంటున్న నిపుణులు ● పిల్లల్లో పెరుగుతున్న మానసిక, శారీరక వ్యాధులు ● అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గుంటూరు (తూర్పు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో అందించే వినోదం పట్ల ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. ఇదేమి కొత్త విషయం కాదు. రోజుల పాటు జరిగే నాటకాల నుంచి, మూడు గంటలపాటు ఉండే సినిమా పట్ల ఆసక్తిని చూపడం వంటివి పూర్వకాలం నుంచే ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్ వచ్చిన తరువాత పరిస్థితులు మారిపోయాయి. తొలిరోజుల్లో యూట్యూబ్‌లో వచ్చే 10 నిమిషాలలోపు నిడివి వీడియోలు ఎక్కువ మంది చూసేవారు. వినోదాల నిడివి గంటల నుంచి నిమిషాలకు కుదించారు. ఈ మధ్యకాలంలో ఈ నిడివి సెకన్లకు తగ్గి షార్ట్స్, రీల్స్ రూపంలో వినోదాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వీటి హవా నడుస్తుంది. సినిమాల ప్రచారం, ముఖ్యమైన వార్తలు సైతం 60 సెకన్లకు కుదించి షార్ట్స్ రూపంలో తీసుకువస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్, కొన్ని రకాల యాప్‌లు షార్ట్ వీడియోలను ప్రోత్సహిస్తున్నాయి.



రీల్స్‌కు బానిసలు అవుతున్న యువత

యూట్యూబ్‌లో వచ్చే సాధారణ వీడియోలకంటే రీల్స్, షార్ట్స్‌ను ఎక్కువ మంది చూస్తున్నారు. తక్కువ నిడివి, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వీడియోలు ఉండటం, మధ్యలో ఎటువంటి వాణిజ్య ప్రకటనలు లేకపోవడం వంటి కారణాలతో వీటిపై ఆసక్తి పెరిగింది. సగటున ప్రపంచంలో ప్రతి వ్యక్తి రోజుకు 400 నిమిషాల పాటు షార్ట్స్ చూస్తే ఇన్ని వీక్షణలు సాధ్యమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత వీటికి బానిసలు అవుతున్నారు. టాయిలెట్‌కు వెళ్లినా, భోజనం చేసే సమయంలోనూ, మంచంమీద పడుకున్నా ఫోన్ చూస్తూనే ఉంటున్నారు. దీనినే 'నోమోఫోబియా' అంటారు. అతిగా మొబైల్ వాడకంతో పరధ్యానం వస్తుంది. చేస్తున్న పనిపై ఏకాగ్రత ఉండదు. రీల్స్‌లో పడి మానవుల సగటు ఏకాగ్రత 2.5 నిమిషాల నుంచి 47 సెకన్లకు తగ్గిందని నిపుణులు చెబుతున్నారు.

ఎన్నో ప్రభావాలు

● స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలు జరుగుతున్నాయి. పిల్లలు తెలియక చేసిన తప్పుకి ఖాతాలో రూ.7 లక్షలు మోసపోయామని నగరానికి చెందిన క్యాటరింగ్ నిర్వాహకుడు ఈ మధ్యనే పోలీసులను ఆశ్రయించాడు.

● ఫోన్‌ను ఆదేపనిగా చూస్తూ ఉండటం వల్లన చూపు తగ్గే ప్రమాదం ఉంది. అర్ధరాత్రి మొబైల్ నుంచి వెలువడే కాంతి కారణంగా శరీరానికి నిద్రకు అవసరమయ్యే హార్మోన్లు విడుదల కావు. దీంతో నిద్ర పట్టక పనితీరు మందగిస్తుంది. రోగ నిరోధకశక్తి తగ్గి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

● పిల్లలు ఫోన్ చూడటానికి స్కూల్, ఇతర కార్యక్రమాలను పక్కన బెడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. మెదడును ఉపయోగించుకుండా ఫోన్‌లపై ఆధారపడినట్లయితే మెదడు బలహీనంగా మారి పరిమాణంలో కూడా చిన్నదైపోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వస్తువులకు బందీలు అయ్యేవారు కూడా బానిసలే అని గ్రీకు తత్త్వవేత్త డయాజినస్ అన్న మాటలు స్మార్ట్‌ఫోన్‌ను అతిగా వినియోగించేవారికి సరిగ్గా సరిపోతాయి. చేతిలోకి వచ్చిన అద్భుతాన్ని సద్వినియోగం చేసుకోకుండా అనవసర విషయాలపై ఆసక్తిని చూపుతూ విలువైన కాలాన్ని వృథా చేయడంతోపాటు మానసిక వ్యాధుల బారిన పడుతున్నారు. కొంతమంది వీడియోలు చూస్తూ రోజువారి పనులు కూడా మర్చిపోతున్నారు. ప్రయాణాల సమయంలో, పనివేళల్లో, చివరికి తినే సమయంలో, బాత్‌రూంకి వెళ్లేటప్పుడు కూడా ఫోను ఉండాల్సిందే. ఇలా రోజులో మూడొంతులు స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నారు. కొంతమంది ఇంకాస్త ముందుకెళ్లి స్వయంగా వీడియోలు తీసి అప్‌లోడ్ చేస్తుంటారు. ఏదో పని చేశామనే భావనతో, ఎలాంటి పని చేయకుండా చిన్నపాటి శ్రమతో నిద్రకు ఉపక్రమించే పరిస్థితులు స్మార్ట్‌ఫోన్ వచ్చాక ఎక్కువగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

30 రకాల వీడియోలు

షార్ట్స్ రీల్సులో వచ్చే వీడియోలు దాదాపుగా 30 రకాలుగా ఉంటున్నాయని యూట్యూబ్ గుర్తించింది. ముఖ్యంగా డబ్‌స్మాష్, పాటలకు నృత్యాలు చేయడం, చిన్నపాటి జోక్‌లు, పెద్ద వీడియోలకు ప్రోమో చిత్రాలు, ఇతరులు చేసే వీడియోలకు గొంతును అందించడం, ఒకేవిధంగా భిన్నమైన చోట్ల జరిగే సంఘటనలను ఒక చోటకు చేర్చడం, చారిత్రక విషయాలను వివరించడం ఎక్కువగా ఉంటున్నాయి. షార్ట్స్, రీల్సు చేసే వారిలో ఎక్కువ శాతం కుటుంబ సభ్యులే ఉంటున్నారు. వీడియోలు చేసే వారి కంటే షార్ట్స్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. భారతదేశంలో స్మార్ట్‌ఫోను ఉన్న ప్రతి 10 కుటుంబాల్లో నలుగురు షార్ట్స్ చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

దృష్టి మళ్లించాలి..



స్మార్ట్‌ఫోన్ బారినపడి యువత సమన్వయం కోల్పోతున్నారు. ఫోన్‌ను ఎక్కువ సమయం చూడటం వలన చిరాకు, అసహనం ఏర్పడుతుంది. 15 ఏళ్ల వయసు కలిగిన వారు పోర్న్ వీడియోలు చూడటానికి ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది దీనికి బానిసలు అవుతున్నారు. కౌన్సెలింగ్ కోసం టీనేజర్లు జీజీహెచ్‌కి తరచూ వస్తున్నారు. పిల్లలు, టీనేజర్ల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఖాళీ సమయంలో పిల్లలను బయటకు తీసుకెళ్లాలి. స్మార్ట్‌ఫోన్ నుంచి దృష్టి మళ్లించాలి.

- ఎన్.ఉమాజ్యోతి,ప్రొఫెసర్, మానసిక వ్యాధుల నిపుణులు, జీజీహెచ్





భ్రమల్లో గడిపేస్తున్నారు



అత్యాధునిక సాంకేతికత కలిగిన ఫోన్లు అందుబాటు లోకి రావడంతో వీటితో గడిపే సమయం కూడా పెరిగింది. అదే పనిగా ఫోన్ చూడటం వలన అద్భుతాలు సృష్టించడం తెలికనే భ్రమల్లో ఉంటున్నారు. తక్కువ నిడివి ఉన్న వీడియోలు మనిషిని ప్రభావితం చేస్తాయి. ఈ వీడియోలు పూర్తిగా గుర్తుంటాయి. దీంతో ఇవి మెదడుపై ప్రభావం చూపుతాయి. వీడియోలు చేసేవారు కూడా సమాజంలో తాము ప్రత్యేకమైన వ్యక్తులుగా భావిస్తుంటారు. దీనివల్ల ఇతరులతో ఉండే సంబంధ బాంధవ్యాలకు దూరమవుతారు. ప్రత్యేకమైన వ్యక్తులుగా గుర్తింపు పొందటం అంత తేలిక కాదు.

-ఐవీఎల్ నరసింహారావు, సైక్రియాటిస్ట్, గుంటూరు

మంచి ఆహారపు అలవాట్లతో అలర్జీలు దూరం

మంగళగిరి సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటే అలర్జీలకు అడ్డుకట్ట వేయవచ్చని వైద్య నిపుణులు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు


తెలిపారు. చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో శనివారం ప్రారంభమైన జాతీయ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన పిల్లల వైద్యులు అలర్జీలపై ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా అనేక రుగ్మతలు పెరుగుతున్నాయని, వాటిలో అలర్జీల సంఖ్య అధికంగా ఉందని చెప్పారు. చిన్నపిల్లల్లో అలర్జీల సమస్య తీవ్రంగా ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, రకరకాల కాలుష్యాలు మనిషి శరీర, ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మి, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరి డాక్టర్ సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ శనక్కాయల రాధామాధవి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, పిల్లల అలర్జీ జాతీయ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్, కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్, డాక్టర్ కే.మురళీధర్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్, డాక్టర్ వి.రఘురామరెడ్డి, డాక్టర్ వై.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో ముగ్గుల పోటీలు

ఏపీఅమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ప్రథమ బహుమతి రూ.25 లక్షలుగా ప్రకటన

వినుకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా అంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు శనివారం తెలిపారు. ముగ్గుల పో



ముగ్గుల పోటీల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

టీ గోడ్‌ప్రతులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వినుకొండలో శనివారం ఆవిష్కరించారు. ఫొటో, వీడియో రూపంలో ముగ్గులు పంపించి పోటీల్లో పాల్గొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. డిసెంబరు 1 నుంచి జనవరి 15 వరకు ఎంట్రీలు పంపవచ్చన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25 లక్షలు, రెండో బహుమతి రూ.15 లక్షలు, మూడో బహుమతి రూ.10 లక్షలు, నాల్గో బహుమతి రూ.5లక్షలు, ఐదో బహుమతి 2 లక్షల రూపాయలు అందిస్తామన్నారు. 100 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు ఏపీఏముగ్గులు(ఎట్‌దిరేట్ ఆఫ్)టిహెచ్‌ఈఏపీఏ.నెట్ కు ఈమెయిల్‌ను సందర్శించాలన్నారు.

రక్తికట్టిన రాచగావు

◆ ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు ◆ వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీరాచారవంతులు

కారంపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవఅయ్యవారును ఇంటి నుంచి వీరాచారవంతులు ఊరేగింపుగా వీర్ల దేవాలయానికి తీసుకొచ్చారు. పలు జిల్లాల నుంచి వీరాచారవంతులు తరలివచ్చారు. వారు తొలుత తమ ఆయుధాలను నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి నూతన వస్త్రాలను అలంకరింపజేసి వీరుల ఆలయంలో ఉంచారు. పూజల అనంతరం పీఠాధిపతి కోటగోడ ముఖద్వారంపై ఎర్రజెండా



గంగధార మడుగులో ఆయుధాలకు స్నానమాచరింపజేస్తున్న వీరాచారవంతులు

ఎగురవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆనాడు మాచర్ల, గురజాల రాజులు యుద్ధానికి సిద్ధం కమ్మని యుద్ధభూమిలో ఎర్రజెండా ఎగురవేసిన సూచికంగా పీఠాధిపతి ఎర్రజెండా ఎగురవేశారు. అనంతరం రాచగావు మంటపంలో పీఠాధిపతిని కంకణదారిని చేశారు. మేకపోతును గావు పట్టినట్టు నాటకీయంగా నిర్వహించారు. వీరవిద్యావంతులు మంటపంలో రాచగావు కథను గానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, గ్రామ పెద్దలు, వీరాచారవంతులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం నెలకొంటుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వీరుల ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద తెలుగు రాష్ట్రాలస్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. మొదటి రోజైన శనివారం ఆరుపళ్ల విభాగపు పోటీలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడ్ల పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. ఆరుపళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొనగా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి, కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండ కృష్ణకిషోర్‌రెడ్డి ఎడ్లజత ప్రథమస్థానంలో నిలిచింది. ప్రత్తిపాడు మండలం పెద గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత రెండోస్థానం, పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత మూడోస్థానం, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, ధరణి ఎడ్లజత నాలుగోస్థానం, నకరికల్లు మండలం చల్లగండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లజత ఐదోస్థానం, గుంటూరుకు చెందిన పిడపర్తి శ్రీనివాసరెడ్డి, నూజెండ్ల మండలం రెడ్డిపాలేనికి చెందిన జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్లజత ఆరోస్థానంలో నిలిచాయి.



విజేత ఎడ్లజతతో మాజీ మంత్రి ఆలపాటి, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, అంజయ్య

ఉత్తరాఖండ్‌పై ఆంధ్రా ఘనవిజయం

మంగళగిరి స్టేడియంలో కొనసాగుతున్న క్రికెట్



అరవ్ (103 పరుగులు)



రాజేష్ (6 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌పై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 137 పరుగులతో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 70.1 ఓవర్లలో 255 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. దీంతో ఆంధ్రా జట్టు 136 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్ అరవ్ మహాజన్ 103 పరుగులతో రాణించాడు. ఆంధ్రా బౌలర్లు ఎన్.రాజేష్ 6 వికెట్లు, ఏఎన్‌వీ లోహిత్ 4 వికెట్లు పడగొట్టారు. ఆంధ్రా జట్టుకు 6 పాయింట్లు లభించాయి.

బాల్‌బ్యాడ్మింటన్‌లో గుంటూరు ప్రథమం

తూర్పుగోదావరిలో ముగిసిన అంతర జిల్లాల బాలికల పోటీలు

బిక్కవోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గుంటూరు జట్టు నిలిచింది. ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్లు సాధించాయి. విజేత జట్లకు జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు ట్రోఫీలు అందజేశారు.

హోరాహోరీగా పోటీలు..

ఫైనల్స్‌లో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది. అలాగే విశాఖ.. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది..



ప్రథమ స్థానం సాధించి డీఈఓ నుంచి ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు బాలికలు

రఘురామ కేసు దర్యాప్తులో కదలిక

- సీఐడీ కార్యాలయాన్ని పరిశీలించిన దర్యాప్తు అధికారి, ప్రకాశం ఎస్పీ దామోదర్

గుంటూరు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన కేసు దర్యాప్తులో కదలిక మొదలైంది. నరసాపురం వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణరాజును 2021 మే 14న హైదరాబాద్ నుంచి అక్రమంగా నిర్బంధించి గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తీసుకువచ్చి కస్టడీలో చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటనపై గత జూన్‌లో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ ప్రధాన నిందితునిగా ఉండగా నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు రెండో నిందితుండిగా ఉన్నారు. అదే విధంగా నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి మూడో నిందితునిగా ఉండగా, నాటి సీఐడీ అదనపు ఎస్పీ రావెల విజయ్‌పాల్ నాలుగో నిందితునిగా, అదేవిధంగా నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి 5వ నిందితురాలుగా ఉన్నారు. ఆ కేసులో నాలుగో నిందితుడైన విజయ్‌పాల్‌ను మూడు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశించారు. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. కాగా ఆయనను కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ను కోర్టు కొన్ని సాంకేతిక కారణాల నేపథ్యంలో తిరస్కరించింది. ఇదిలా ఉంటే ఈ కేసులో మొదటిసారిగా దర్యాప్తు అధికారిగా ఉన్న ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ శనివారం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని ప్రతి గదిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా కస్టడీలో రఘురామరాజును చిత్రహింసలకు గురిచేసిన గదిని అక్కడ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో నాలుగో నిందితుడైన విజయ్ పాల్ ఎట్టకేలకు అరెస్ట్ అయిన నేపథ్యంలో కేసు దర్యాప్తు వేగవంతమైంది. ఆయన కస్టడీ పిటీషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో సోమవారం మరోసారి ఎటువంటి లోపాలు లేకుండా కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు. కస్టడీలో విజయ్‌పాల్ నోరు మెదుపుతారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయన చెప్పే అంశాల ఆధారంగా కేసు దర్యాప్తు ఉంటుందని భావిస్తున్నారు. కేసులో ఇరువురు ఐపీఎస్ అధికారులు, మాజీ సీఎం జగన్ నిందితులుగా ఉన్న నేపథ్యంలో కేసు దర్యాపును అత్యంత జాగ్రత్తగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వారి అరెస్ట్‌పై చర్చ నడుస్తున్న సమయంలో ప్రకాశం ఎస్పీ దామోదర్ సీఐడీ కార్యాలయాన్ని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉత్సాహంగా కేఎల్‌యూ స్నాతకోత్సవం

42 బంగారు, 37 రజిత పతకాలు, 166 పీహెచ్‌డీల ప్రదానం

ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. తల్లిదండ్రుల ఆనందోత్సాహాల మధ్య తాడేపల్లి మండలం



రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న కెఎల్ మేనేజిమెంట్ బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల

వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పతకాలు ప్రదానం చేశారు. రామ్‌నాథ్ కోవింద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. శారీరక దృఢత్వం అవసరమని, యోగా ప్రాణాయామం, వ్యాయామం లాంటి కసరత్తులు చేస్తూ యువత ఎప్పుడు ధృఢంగా ఉండాలని చెప్పారు. కేవలం డిగ్రీ ఉంటే సరిపోదని, డిగ్రీతోపాటు నైపుణ్యాలు నేటి యువతకు అవసరమన్నారు. కేఎల్‌యూ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి తమ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపడతున్నారని చెప్పారు. తమ విద్యార్థులు దేశ విదేశాల్లో రూ.57లక్షల జీతాలతో ఉద్యోగాలు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ సారధివర్మ మాట్లాడుతూ 42 బంగారు, 37 రజిత పతకాలు, 166 పీహెచ్‌డి, 604 పీజీ, 3936 యూజీ సర్టిఫికెట్లు ప్రదానం చేశామని తెలిపారు. విద్యార్థులు ఆయా విభాగాల్లో 170కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. డిగ్రీలు అందుకునే విద్యార్థులతో కోనేరు సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, కలెక్టర్ నాగలక్ష్మి, రిజిస్ట్రార్ సుబ్బారావు, కేఎల్‌ఈఎఫ్ కార్యదర్శి కోనేరు కాంచనలత, ఉపాధ్యక్షులు కోనేరు రాజాహరీన్, బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల, ప్రోవీసీలు, వివిధ విభాగాల అధిపతులు, డీన్లు పాల్గొన్నారు.

ప్రశాంత్‌సిన్హాకు బంగారు పతకం

వర్సిటీలో ఉత్సాహంగా పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉత్సాహపూరిత వాతావరణంలో సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతున్నాయి. తొలిరోజు పోటీ ఫలితాలను నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. 55 కేజీల కేటగిరీలో మంగళూరు యూనివర్సిటీకి చెందిన ప్రశాంత్‌సిన్హా బంగారు పతకాన్ని కైవాసం చేసుకున్నారు. మొత్తం 220 కేజీల బరువులెత్తిన ఆయన మొదటి స్థానంలో నిలిచారు. తిరువల్లూరు యూనివర్సిటీకి చెందిన పి.బాలాజీ, అదే యూనివర్సిటీకి చెందిన కె.సంజయ్ వెండి, కాంస్య పతకాలను అందుకున్నారు. 61 కేజీల విభాగంలో తిరువల్లూరు యూనివర్సిటీకి చెందిన పి.ధనుష్‌కుమార్ 256 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని కైవాసం చేసుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడాకారుడు డి.మౌలాలి వెండి, మంగళూరు యూనివర్సిటీకి చెందిన సుబ్రహ్మణ్య కాంస్య పతకం గెలుపొందారు.

3వరకు రాయగడ ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకే

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబరు 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు విజయనగరం వరకే ప్రయాణిస్తుందని రైల్వేవర్గాలు తెలిపాయి. అలానే రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు చేరుకొంటుందని పేర్కొన్నాయి. కాగా ఈ విషయాన్ని శనివారం సాయంత్రం వరకు రైల్వే అధికారులు ప్రయాణికులకు తెలియజేయకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 2423 క్యూసెక్కులు

దుగ్గిరాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 2423 క్యూసెక్కులు విడుదల చేసినట్లు శనివారం నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.8 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 294క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 48, పశ్చిమకాల్వకు 60 నిజాంపట్నంకాల్వకు 198 కొమ్మమూరుకాల్వకు 1343 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అర్హులందరికి సంక్షేమ ఫలాలు

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు
● వివిధ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

గుంటూరు(తూర్పు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. శనివారం రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క రోజు ముందే పెన్షన్ల పంపిణీ చేయడం సీఎం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. త్వరలోనే అర్హులైన వారికి రేషన్ కార్డుల అందజేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తప్పక అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, గంధం సురేష్, పంచుమర్తి శేషు, బుర్రి సురేష్, కార్పొరేటర్లు నూకవరపు బాలాజీ, బొడ్డుపల్లి స్మిత పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 8 గంటలలోపే 60 శాతానికి పైగా పింఛన్‌ల పంపిణీ పూర్తిచేశారు. కాగా సాయంత్రానికి దాదాపు 95శాతానికి పైగా పింఛన్‌ల పంపిణీ చేశారు.


పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల , నేతలు

మొత్తం 9,205 మంది ఉండగా రూ.3 కోట్ల 84 లక్షల 91 వేల 500 మంజూరయ్యాయి. జిల్లాలో తొలిరోజు పింఛన్‌ల పంపిణీలో దుగ్గిరాల మండలం మొదటి స్థానంలో నిలిచింది. మండలగ్రామం చిలువూరులో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, స్థానిక నాయకులతో కలిసి పింఛన్‌ల పంపిణీలో పాల్గొన్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు స్వయంగా పింఛన్ దారుల ఇళ్లకువెళ్లి అధికారులతో కలిసి వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్‌లను పంపిణీ చేశారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందే సామాజిక ఫించన్లను అధికారుల మండలంలో పూర్తి చేశారు. ఒకటవ తారీఖున ఇవ్వాల్సి ఉండగా ఆదివారం కావటంతో శనివారమే పంపిణీ చేశారు. మండల కేంద్రం తుళ్లూరు ఫింఛన్ల పంపిణీ కార్యాక్రమంలో ఎంపీడీవో కే.శిల్పా పంచాయతీ అధికారులతో కలసి ఫింఛన్లను పంపిణీ చేశారు. 92 శాతం ఫింఛన్లు పంపిణీ చేశామని ఆమె తెలిపారు. అందుబాటులో లేని మిగిలిన వారికి సోమవారం అందజేస్తామన్నారు. ఉద్దండ్రాయునిపాలెంలో మాజీ సర్పంచ్ బత్తుల కోటటేశ్వరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావులు లబ్ధిదారులకు ఫింఛన్లు పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో టీడీపీ జనసేన నేతలు, కార్యకర్తలు అధికారులతో పాటు ఫింఛన్ పంపిణీలో పాల్గొన్నారు.


ఉద్దండ్రాయునిపాలెంలో పింఛన్ పంపిణీలో టీడీపీ నేతలు


పుత్తడిబొమ్మ.. పూర్ణమ్మ నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మహనీయుడు గురజాడ

● సాంఘిక దురాచారాలను ఎదురించిన మహాకవి
● గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా నివాళులు

దుగ్గిరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో వేళ్ళూనుకు పోయిన సాంఘిక దురాచారాలను తన రచనల ద్వారా ఎదిరించిన మహనీయుడు, మహాకవి గురజాడ అప్పారావు అని, ఆయనను ప్రజలు ఎన్నటికీ మరువలేరని విశ్రాంత ఆచార్యుడు బొల్లు లలితానంద అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురుజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాషా సంస్కరణలతో పాటు సంఘ సంస్క రణలకోసం పాటు పడిన గురజాడ చిరస్మరణీయుడన్నారు. సంగీత నృత్య కళాకారుడు, బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని జనరంజకంగా మలిచిన తీరును గుర్తుచేశారు. బాలికలు ప్రదర్శించిన పుత్తడి బొమ్మా..పూర్ణమ్మ నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు 53వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్ర కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్య తీసుకువచ్చారని, తెలుగు సాహిత్యంలో అందరికీ అర్థం అయ్యే విధంగా రచనలు చేశారన్నారు. వారిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ మండల అధ్యక్షుడు ముద్దన వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకురాలు మర్రి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

పెదనందిపాడు, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని సీడీపీవో వై సుజాతాదేవి అన్నారు. బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 1వ వారులోని బీసీ-3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. గ్రామ నిర్మూలన కమిటీలు బాల్యవివాహాలపై దృష్టిసారించాలని, ఎక్కడైనా జరిగినట్లైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వాటిని నిలిపివేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాలు నిర్మూలిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సీ విజయనిర్మల, సూపర్‌వైజర్ వై.రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుకార్లను, మధ్యవర్తులను నమ్మవద్దు

ఫిరంగిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు పుకార్లను, మధ్యవర్తుల మాటలను నమ్మవద్దని తహసీల్దార్ జే ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మాత్రమే అర్హులైన వారికి ఇంటి నివేశన స్థలాలను మంజూరు చేస్తామని అన్నారు. నివేశన స్థలాలు, భూ సమస్యలు, రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్న వారు స్వయంగా ఫిరంగిపురం తహసీల్దార్‌ను కలసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు మండవ నరసింహారావు మాట్లాడుతూ కొందరు అత్యుత్సాహంతో ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఇళ్ళ పట్టాలు ఇప్పిస్తామని చెప్పి అర్జీలు స్వీకరిస్తున్నారని, ఇది తగదని, ప్రభుత్వమే అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరు చేస్తుందన్నారు. ప్రజలకు అపోహలు సృష్టించే విధంగా ఎవరూ నడుచుకోవద్దని మండవ నరసింహారావు కోరారు.


రైతు నేస్తం కార్యాలయాన్ని సందర్శించిన ఎస్ఆర్ఎం విద్యార్థులు

చిరుధాన్యాలతో ఆరోగ్యకర జీవనం

● రైతు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

మంగళగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, అరికెలతో తయారు చేసిన ఆహారంతో ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని గుంటూరు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు శనివారం కొర్నెపాడులోని రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. గోవుల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరు వుల తయారీ, వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్పత్తుల తయారీ గురించి వెంకటేశ్వ రరావు విద్యార్థులకు వివరించారు. దేశ వ్యాప్తంగా చిరుధాన్యాలపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మిల్లెట్ రాంబాబు విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వందనస్వామి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాంబశివరావు, ఎస్ఆర్ఎం మీడియామేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో వివిధ కారణాలతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, అందుకు ప్రస్తుతం మన ఆహార అలవాట్లే ప్రధాన కారణమన్న విషయాన్ని గమనించలేక పోతున్నారని చిరుధాన్యాల నిపుణులు మిల్లెట్ రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కొర్నెపాడు పంచాయతీ పరిధిలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో కర్షక్ సేవా కేంద్రం నిర్వాహణలో మూడు రోజుల పాటు జరగనున్న రైతు శిక్షణా కార్యక్రమం శనివారం ప్రారంభం కాగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

పెదనందిపాడు, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం సీపీఎం పార్టీ నేత కాపు వెంకటసుబ్బారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రధాన సమస్య గుంటూరు ఛానెల్ పొడిగింపుపై ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించి, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ విధానాలనే ప్రభుత్వం అనుసరిస్తుందని, తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక, మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వరి ధాన్యాన్ని షరతులు లేకుండా పండించిన పంట మొత్తాన్ని మద్దతు ధరతో కొనులు చేయాలన్నారు. ఓ వైపు తుఫాను భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచమి హామీ ఇచ్చి నేడు సర్దుబాటు చార్జీల పేరుతో 16వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపడం సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరుద్యోగ సమస్య, ఉపాధి కరువైందని ఒక పక్క నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతుండడంతో సామాన్యుడి జీవనం మరింత భారంగా మారిందని, దీనిపై ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బైరగాని శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ముట్లూరులో శౌరివారి

తిరునాళ్ళ మహోత్సవం

వట్టిచెరుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముట్లూరు గ్రామంలో అతి పురాతన మైన ప్రసిద్ది చెందిన పునీత శౌరివారి తిరునాళ్ళ మహోత్సవం డిసెంబరు 3న జరగనున్న నేపథ్యంలో ఆలయ అంతర్భాగంలో శౌరివారికి సంబంధించిన వివిధ స్వరూపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరణకు శ్రీకారం చుట్టారు. అలాగే తిరునాళ్ళకు వచ్చే భక్తుల కోసం భారీ రంగుల రాట్నాలు, వస్తుల విక్రయాల కోసం షాపులను ఏర్పాటు చేసు కుంటున్నారు. ఫాదర్ దిలీప్ కుమార్ సహచర ఫాదర్లతో కలసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


బహుమతులు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

గీతాంజలి స్కూల్ విద్యార్థులకు

బహుమతుల పంపిణీ

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి క్రికెట్, ఖో ఖో, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో కుంచనపల్లికి చెందిన గీతాంజలి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు, మెమెంటోలు మెడల్స్ రోటరీ క్లబ్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరికి క్రీడా స్ఫూర్తి అవసరమన్నారు. గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ మున్నంగి రమాదేవి, క్లబ్ కోశాధికారి ఏ రవీంద్రారెడ్డి, సభ్యులు మున్నంగి వివేకానందరెడ్డి, చంద్ర ఓబులారెడ్డి, నరేంద్ర, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదన మృతి

పార్టీకి తీరని లోటు

కాకుమాను, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, లింగంగుంటపాలెం మాజీ సర్పంచ్ మదన నాగిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి అన్నారు. మండల పరిధిలోని లింగంగుంటపాలెంలో శనివారం మదన నాగిరెడ్డి మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, నల్లమోతు పూర్ణచంద్రరావులు మదన నాగిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మదన మృతి వార్త తెలుసుకున్న పొన్నూరు శాసనసభ్యులు, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల న రేంద్రకుమార్ మదన కుటుంబసభ్యులకు ఫోన్‌లో సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం లింగంగుంటపాలెం అధ్యక్షుడిగా పాల రైతుల ప్రయోజనాల కోసం విశేష కృషి చేశారన్నారు.


నిర్మాణాలు కూల్చివేసిన మున్సిపల్ అధికారులు

సిమెంటు కంపెనీ భూముల్లో

నిర్మాణాలు కూల్చివేత దారుణం

తాడేపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ నిర్మాణాలు ఏర్పరచుకుంటున్న కార్మికుల షెడ్లను మున్సిపల్ అధికారులు కూల్చడం దుర్మార్గమని సీఐటియూ నేత వేముల దుర్గారావు అన్నారు. శనివారం నిర్మాణాలను జెసిబిలతో కూల్చివేసి ప్రభుత్వం యాజమాన్యం వైపునే ఉన్నట్లుగా అవగతమైందన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి గానీ బూర్జువా నేతల వైపు కొమ్ము కాయకూడదన్నారు. 35వ రోజు దీక్షల్లో కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, యోహోషువ, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, ఆశీర్వాదం, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ న్యాయసమ్మతమైనదే'

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్ న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనదని ఆంధ్ర మేధా వుల ఫోరం కన్వీనర్ పీఏస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవ గాహన సంస్థ కార్యాలయంలో ప్రత్యేక హోదా - హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు ధర్మం కాదు అనే అంశంపై శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మబద్ధమైన ప్రత్యేక హోదాను సాధించుకోవటానికి ప్రజలు ఐక్యంగా ఉద్య మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రజలకు మరింత నిరాశకు గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్ పక్కదారి పడితే సహించేది లేదు

● డీలర్లకు తహసీల్దార్ కళ్యాణి హెచ్చరిక

మేడికొండూరు నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని, ఈ విషయంలో రేషన్ డీలర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మేడికొండూరు తహసీల్దార్ కే. కళ్యాణి హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద వర్గాల ప్రజల కోసం కిలో బియ్యం రూ. 46.20 పైసల వ్యయంతో ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నదని, ఒక గింజ బియ్యం బయటకు వెళ్లినా ఉపేక్షించేది లేదని అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలో మన మండలంలోను రేషన్‌బియ్యం పట్టుబడిన విషయాన్ని గుర్తుచేశారు. రేషన్ డీలర్లు కార్డు దారులకు పంపిణీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని వారికి సరైన అవగాహన కల్పించాలని కోరారు. కార్డు దారులు తాము తీసుకున్న బియ్యాన్ని ఇతరులకు అమ్మడం వంటివి చేయకుండా సూచనలు చేయాలన్నారు. కార్డుదారులు కూడా అవసరం అనుకుంటేనే బియ్యం తీసుకోవాలని, ఎవరైనా డీలర్లు డబ్బు ఆశ చూపితే వేలి ముద్రలు వేసి వారు ఇచ్చే డబ్బు తీసుకొని వెళ్లవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్డు దారులు రేషన్ సరుకులు అవసరం లేదనుకుంటే తీసుకోకుండా ప్రభుత్వానికి సహకరించాలని ఆమె సూచించారు. రేషన్ బియ్యం కొనేవారిపై పడి యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని తహసీల్దార్ కళ్యాణి వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ దేవరాజ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ కళ్యాణి

కాంట్రాక్టు లెక్చరర్లను

క్రమబద్ధీకరించాలి

మంగళగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, అందుకోసం జీవో నెం.114ను విడుదల చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, బీజే గాంధీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ రెగ్యులర్ అయ్యారని, ఒక్క విద్యా వ్యవస్థలోని కాంట్రాక్టు లెక్చరర్లు మాత్రమే క్రమబద్ధీకరణకు నోచుకోలేదని తెలిపారు. ఈ మేరకు ఈ నెల 4వ తేదీన విజయవాడలో సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చామని వెల్లడించారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపండి

కాకుమాను, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కే.ఎఫ్. కెన్నడీ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రమైన కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే ప్రోగ్రెస్ కార్డులను వారి తల్లిదండ్రులకు ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి స్థాయిలను తెలియజేయాలన్నారు. అనంతరం స్థానిక ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

శోభాయమానంగా

జ్యోతి లింగార్చన

వట్టిచెరుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా శనివారం ఆలయ కమిటీ, దేవాదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షణలో శనివారం ఆలయంలోని స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. 300 ప్రమిదలతో జ్యోతిర్లింగార్చన, 11 కేజీల కర్పూర జ్యోతి ప్రజ్వలన భక్తులను ఆకట్టుకుంది. స్థానిక పూజారి వేద పండితులు కృష్ణస్వామి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. దేవాదాయ ధర్మా దాయశాఖ ఆలయ అధికారి కృపారెడ్డి దంపతులు, ఆలయకమిటీ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజలపై విద్యుత్ భారం

మాజీ సీఎం జగన్ పాపమే

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ అవినీతి వల్లే ప్రజలపై విద్యుత్ భారం పడిందని ఐదేళ్లలో జగన్ తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై సర్‌చార్జీల భారాన్ని మోపారని టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు దారుణంగా నాశనమయ్యాయని విద్యుత్ భారం తీవ్రమైన దుర్మార్గ చర్యని అతి తెలివితేటలతో ప్రజలపై భారం మోపి ప్రజలను ఇబ్బందులపాలు చేశారని అందుకే జగన్‌కు ప్రజలు షాక్ ఇచ్చారని చెప్పారు. అన్నిరంగాలు జగన్ హాయంలో నిర్వీర్యమయ్యాయన్నారు. చంద్రబాబు లోకేశ్‌లను రామ్‌గోపాల్ వర్మ విమర్శించడాన్ని దుయ్యబట్టారు. జగన్ సోదరి షర్మల అదానీ, జగన్‌ల అవినీతిని ఎండగట్టారన్నారు.

నేడు డీఆర్ఎం కప్ ఫైనల్ మ్యాచ్

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్-2024లో భాగంగా క్రికెట్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ ఆదివారం నల్లపాడులోని రైల్‌విహార్‌లో జరుగుతుందని గుం టూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. శనివారం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లలో గుంటూరు ఎస్పీ జట్టు, పల్నాడు ఎస్పీ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. రెండో సెమీఫైనల్స్‌లో డీఆర్ఎం లెవన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో బాపట్ల ఎస్పీ జట్టుపై గెలుపొందింది. ఆదివారం డీఆర్ఎం లెవన్, గుంటూరు ఎస్పీ జట్ల మధ్యన ఫైనల్స్ మ్యాచ్ జరుగుతుంది. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.


సుబ్బారెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు

గాదె సుబ్బారెడ్డి ఆకస్మిక మృతి

తాడేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి(78) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం ఉండవల్లిలో కృష్ణానది వద్ద ఈతకు వెళ్లిన సుబ్బారెడ్డి గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వీ.శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి మధు సుబ్బారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం పాటుపడిన ధన్యజీవి సుబ్బారెడ్డి అని అన్నారు. పలువురు మాట్లాడుతూ ప్రజానాట్య మండలి ద్వారా కళారూపాలు తీర్చిదిద్దడంలో సుబ్బారెడ్డి కొత్త ఒరవడి సృష్టించారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సుబ్బారెడ్డి మృతదేహాన్ని ఎన్నారై వైద్య విద్యార్థుల పరిశోదన కోసం ఇవ్వడానికి, కళ్లను హైదరాబాద్‌లోని ఎల్‌వీఆర్ కంటి ఆసుపత్రికి ఇవ్వడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. సుబ్బారెడ్డి మృతి పట్ల సీపీఎం నేతలు బాబూరావు, శివశంకర్, వెంకటరెడ్డి, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, పాశం రామారావు, అనిల్‌కుమార్, ప్రజా సంఘాల నేతలు, ప్రజానాట్య మండలి కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్తమ అధ్యాపకులకు అభినందన

తాడికొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మోతకడ చలపతి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శనివారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రంగాలలో చేసిన కృషికి ఉత్తమ అధ్యాపకులుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్, ఇంజనీరింగ్ రీసెర్చర్స్ సొసైటీ అవార్డులు అందజేసిందని తెలిపారు. ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ వీ.వీ. సుబ్బారావు, డాక్టర్ పీ.బాల మురళీకృష్ణ, డాక్టర్ డీ.కళ్యాణ్‌కుమార్, డాక్టర్ బీ. తులసీ రాణి, డాక్టర్ డీ.రవికిరణ్, ఎస్.శాంతి ప్రియ, జీ.రామ చంద్రరావు, ఆర్.హెచ్.నాయక్, ఎస్.శ్రీకాంత్, ఎస్.శ్రీనివాసరావు, షైక్ ఖాదర్‌బాషా, పీ.సుస్మితవదన, పీ.శ్రీవిద్య జీ.గీతలు ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ అధ్యాపకుల అవార్డులు పొందిన వారిని కళాశాల సెక్రటరి వై.సుజిత్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మృతిరాలి కుటుంబానికి ఆర్థికసాయం

తాడికొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంతో మృతిచెందిన కే.దేవి కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేసినట్లు సెయింట్‌పాల్ సొసైటీ అధ్యక్షుడు బీ.సాయిప్రసాద్ తెలిపారు. శనివారం తాడికొండ శివారు బడేపురం గ్రామంలో మృతురాలు దేవి కుటుంబానికి రూ.10 వేలను అందజేశారు. ఈసందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని ఒక కుటుంబం కష్టంలో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో 8వవార్డు సభ్యులు టీ.శ్రీను, కాలిశెట్టి శివయ్య టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో యువతకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో కంపెనీల ప్రతినిధులు

మంగళగిరి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన, సీడాప్ ఆధ్వర్యంలో మంగళగిరి గణపతినగర్‌లోని వీజే డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 192 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 86 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 10 కంపెనీల ప్రతినిధులుహాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కనీసంగా రూ.13 వేల నుంచి గరిష్ఠంగా రూ.30 వేల వేతనాలతో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వీజే డిగ్రీ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. జీతభత్యాలను గురించి ఆలోచించ కుండా ఉద్యోగాల్లో చేరితే అనుభవం వస్తుందని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యపడుతుందన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన జేఈవో కే.రమాదేవి, వైపీ హారిక సౌగంధి, డీఎస్ డీవో కే.సంజీవరావు, డీపీవో పీ.ఈశ్వర్, వీజేకళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజధానిలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

తుళ్లూరు, నవంబరు 30: రాజధాని అమరావతిలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు శనివారం సీడ్ యాక్సెస్ రోడ్డు మీద నిర్వహించారు. చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖ పట్నం విజయనగరం, వెస్ట్ గోదావరి జిల్లాలకు చెందిన బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు. పది కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలు జరిగాయి. రాష్ట్ర స్థాయి సైకింగ్ సెలక్షన్ కోసం సాప్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలు రెండు రోజులు ఈ పోటీలు జరుగుతాయని డీఎస్‌డివో(డిస్ట్రిక్ స్పోర్ట్స్ అధికారి) నరసింహారెడ్డి తెలిపారు. రాబోయే రోజులలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలు సాప్ ఆధ్వర్యంలో రాజధానిలో నిర్వహించటానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్ పోలీసులు, మెడికల్ డిపార్ట్‌మెంట్, తల్లిదండ్రులు పోటీలకు సహకరించినట్లు చెప్పారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీల కోసం సీడ్ రోడ్డు మీద ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు. 9జిల్లాల నుండి వంది మంది బాల బాలికలు(13 సంవత్సరాలు పైబడి) క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. సమయం ప్రకారం పోటీలలో విజేతలు ఎవరనేది ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమంలో సాప్, జాతీయ ఫెడరేషన్ నుండి టెక్నికల్ సభ్యులు ధర్మాండ లంబా, ఎంకె పాషా, ఆకాశ్ పాల్గొని పోటీలు నిర్వహించారు.


సీడ్ రోడ్డు మీద సైక్లింగ్ పోటీలలో పాల్గొన్న బాలబాలికలు

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

తెనాలి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒకరోజు ముందే లబ్ధిదారులకు పింఛన్‌ను అందిస్తున్నట్లు ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్ పేర్కొన్నారు. తొలిరోజు 95శాతం మందికి పింఛన్ దారుల ఇంటివద్దకే వెళ్లి ఉద్యోగులు అందించారు. మిగిలిన వారికి కూడా సకాలంలో అందించడం జరుగుతుందని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణ మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష వైఖరిపై ఏపీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ వారికి హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్ ఫిర్యాదు చేశారు. స్థానిక ఐతానగర్‌లో న్యాయవాది పెరికల డేనియల్ శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై వీధికుక్కల దాడులు, నివాస గృహాల మధ్య ఖాళీస్థలాలు, చెత్త సేకరించే ట్రాక్టర్లను నిర్లక్ష్యంగా నడుపుతున్న డ్రైవర్లపై గతంలో ఫిర్యాదు చేశామన్నారు. కానీ మున్సిపల్ కమిషనర్ ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్షంగా వ్యవహరించడంతో ఏపీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వికాస కార్యవర్గం ఏకగ్రీవం

పెదకాకాని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా దాసరి విజయ ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా తోట వెంకటేష్, నేలపాటి నాగేశ్వరరావు, కోశాధికారిగా కొలికపూడి యేషయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చిమట ఆనంద్ కుమార్, పి. నాగరాజు, సిహెచ్. సాంబశివరావు, కేతావత్ శశిధర్, జి. శ్రీను, నల్లగుర్ల శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వర్లు ఏకగ్రీవమయ్యారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపి గాయపర్చాడని ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడుపుతూరోడ్డు పక్కన నిలబడిన వ్యక్తిని గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక నాజరుపేటకు చెందిన బోయిన నరసింహారావు లిక్కరు గోడౌన్‌లో రోజువారి కూలిగా పనిచేస్తాడు. శుక్రవారం సాయంత్రం తన పని ముగించుకొని తన స్నేహితుడిని బస్టాండ్‌లో బస్సు ఎక్కించేందుకు వచ్చాడు. బస్టాండ్ ఎదురుగా ఉన్న రోడ్డు మార్జిన్‌లో నిలబడి ఉండగా జరిగిన ఈ ఘటనలో గాయపడ్డాడు. స్థానికులు స్పందించి వైద్య సేవల నిమిత్తం అతన్ని జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెంలోని మహాత్మాగాంధీ సేవాశ్రమంలో శనివారం ఎస్‌వీ యోగా సభ్యులు కన్నెగంటి సుశీలదేవి పుట్టినరోజు సందర్భంగా ఆమె భర్త కన్నెగంటి పిచ్చయ్య, కుటుంబ సభ్యుల సహకారంతో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, అనూష, జగదీశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరరావు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

గోవర్ధనస్వామి ఆలయంలో హరినామ సంకీర్తన



తెనాలి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నెహ్రూరోడ్డులోని రుక్మిణి సమేత గోవర్ధనస్వామి ఆలయంలో శనివారం హరినామ సంకీర్తన గానం చేశారు. పెరవలి వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కీర్తనల్లో గాయకులు బాలచంద్రమౌళి, రాజేశ్వరి, అర్చన, పుష్పలత, రూపశ్రీలు కీర్తనలు ఆలపించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో ప్రతి వారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వంశీకృష్ణ తెలిపారు. ఈ బృందం డిసెంబరులో తిరుమలలో గానం చేసే అవకాశం లభిస్తుందన్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో హోమాలు



తెనాలి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మారీసుపేటలోని కోదండ రామస్వామి ఆలయంలో శనివారం హోమాలు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా రెండు హోమగుండాలు ఏర్పాటు చేసి లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ రుద్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కె.నారాయణస్వామి, శివానంద కుమార్, ఆంజనేయ ప్రసాద్, సుబ్రహ్మణ్య శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హుండీల ఆదాయం రూ. 1.36 లక్షలు



హుండీ నగదు లెక్కిస్తున్న సిబ్బంది

పొన్నూరుటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టెంపూడిలోని నాగేంద్ర స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు ద్వారా రూ. 1,36,950 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో నిడమానూరు శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ కుమార్ బాబు ఆధ్వర్యంలో శనివారం హుండీల లెక్కింపు జరిగింది. అలాగే, కేశఖండన శాలలో కేశములు పోగు చేసుకునే హక్కుకు ద్వారా రూ. 6,200, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకునే హక్కుకు రూ. 4,100 ఆదాయం సమకూరింది.

రైతులను వెంటాడుతున్న 'ఫెంగల్'

- గాలితో కూడిన వర్షం
- తడిచిన ఓదెలు ... పడిపోయిన వరిపైరు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



కొల్లిపర మండలం అత్తోటలో వర్షానికి తడిచిన వరి ఓదెలు

కొల్లిపర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పెనుతుఫాన్‌గా మారడంతో గత రెండు రోజులుగా రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. రెండు రోజుల నుంచి అడపా దడపా చిరుజల్లులు పడటంతో పంటలను కాపాడుకోవటానికి రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి మబ్బులు కమ్ముకుని ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో, చేతికి వచ్చిన పంట ఎక్కడ చేజారి పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో కొల్లిపర మండలంలో పలుచోట్ల వరి పంట చెల్లాచెదురై నేలవాలింది. ఎక్కడ భారీ వర్షం పడుతుందేమోనని రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర, సిరిపురం, చివలూరు, అత్తోట, దంతలూరు, కుంచవరం తదితర గ్రామాల్లో వరి పంట 90 శాతం వరి కోతకు వచ్చింది. దీంతో కొంతమంది రైతులు యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ఉండటంతో వర్షాలకు తడవకుండా పట్టాలు కప్పి రక్షించుకున్నారు. మరికొంత మంది రైతులు పొలాల్లో, డొంకరోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని హడావిడిగా కూలీల చేత గోతాలకు ఎక్కించి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలించారు. వరి కుప్పలు వేసిన రైతులు ధాన్యం దెబ్బతినకుండా పట్టాలు కప్పారు. పదిరోజుల క్రితం గాలితో కూడిన చిరుజల్లులు పడటంతో పలు చోట్ల వరిపంట పడిపోవటంతో ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షం పడితే ఎక్కడ పంట పూర్తిగా దెబ్బతింటుందేమోనని రైతులు భయపడి హడావిడిగా యంత్రాల ద్వారా నూర్పిడి చేయించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



చివలూరులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ముందస్తుగా పింఛన్ల పంపిణీ

- 95 శాతం మంది లబ్ధిదారులకు చేరిన నగదు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



లబ్ధిదారునికి పింఛన్ పంపిణీ చేస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 1వ తేదీన ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు 1 ఆదివారం రావడంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఏచన్ సొమ్ము పంపిణీకి ఒకరోజు ఆలస్యం అవుతుందన్న ఉద్దేశంతో ముందస్తుగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. పట్టణ పురపాలక సంఘ పరిధిలో 15,200 మంది లబ్ధిదారులు ఉండగా వారికి రూ. 6,47,14, 500 పంపిణీ చేయాలి. అందుకుగాను తొలి రోజు శనివారం సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. 95 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారని మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. వివిధ కారణాలతో పింఛన్లు తీసుకోని లబ్ధిదారులకు మరుసటిరోజున అందించనున్నట్లు పేర్కొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ జయపాల్

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక 30వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త, వ్యర్థాలను మురుగ కాలువలలో వేయవద్దని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, సుందర తెనాలికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కేజయపాల్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఏఈ సునీల్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలకు ప్రతిబింబంగా ఫొటోగ్రఫీ నిలవాలి

ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామమోహన్‌రావు వెల్లడి



అవార్డు అందుకుంటున్న యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ అనిల్ కుమార్

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాస్తవాలను ప్రతిబింబించేలా ఫొటోలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య కే రామ్మోహన్‌రావు అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాలు సంయుక్తంగా శనివారం 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జర్నలిజం విభాగం ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జయ గోవిందబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చు కుని నూతన పద్ధతుల్లో ఫొటోగ్రఫీ వస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రఫీకి సంబంధించిన కోర్సు లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఫొటోగ్రఫీలో నైపుణ్యాల ప్రదర్శించిన 25 మందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, ఫొటోగ్రఫీ అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



ఫుట్‌పాత్‌పై టైల్స్ లేచి ప్రమాదకరంగా ఉన్న గుంత

తెనాలి, మారీసుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాదచారులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు గుంతలుగా మారడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌ల గురించి గత ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదు. వాటిపై టైల్స్ బయటకు రావడంతో.. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. పాదచారులు గుంతల్లో చిక్కుకొని కిందపడి గాయలపాలవుతున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వీధి దీపాలు సైతం రాత్రి సమయంలో వెలగని కారణంగా చీకటిలో గుంతలు కన్పించక పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భార్య కేసు పెట్టిందని చీమల మందుతిని ఆత్మహత్యాయత్నం

తెనాలి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భర్త హింసిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెందిన భర్త చీమలు మందుతిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోరంపూడికి చెందిన నన్నేపాటి సుధీర్‌కు చావావారిపాలెంకు చెందిన దివ్యతో ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యను సుధీర్ మానసికంగా హింసించేవాడు. అతడి ఆగడాలు తట్టుకోలేక పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చి ఉంటోంది. అయితే, ఆమె భర్త అక్కడికి కూడా వెళ్లి వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రూరల్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు భర్త సుధీర్‌ను శనివారం స్టేషన్‌కు రావాల్సిందిగా కోరారు. ఈ క్రమంలో ఇంట్లో చీమల మందును తిని స్టేషన్‌కు వచ్చాడు. మధ్యాహ్నసమయం కావడంతో భోజనం చేసి వచ్చావా అని పోలీసులు నిందితుడు సుధీర్‌ను అడగ్గా తాను చీమల మందుతిన్నానని చెప్పాడు. ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తన సిబ్బందితో అతన్ని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి ప్రాణాపాయం లేదని తెలిపారు. మీడియాతో ఆసుపత్రిలో సుధీర్ మాట్లాడుతూ చిన్నపాటి మనస్పర్థల కారణంగా పుట్టింట్లో ఉన్న భార్యాపిల్లలను చూసేందుకు వెళితే తనను లోపలికి రానివ్వలేదని, తన పిల్లలను కూడా చూడనివ్వడంలేదని ఆరోపించారు. మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు టెక్‌బుక్ దోహదం

తెనాలి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో జ్ఞానాన్ని పెంచేందుకు టెక్‌బుక్ దోహదపడుతుందని నెహ్రూనికేతన్ స్కూల్ ఎండీ మురళీకాంత్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో లీడ్‌స్కూల్ రూపొందించిన టెక్‌బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మురళీకాంత్ మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక జ్ఞానాన్ని జోడించి వచ్చే విద్యా సంవత్సరం పుస్తకాలను పాఠశాలలో ప్రవేశ పెడుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ పుస్తకాలను ప్రవేశపెడతామని అన్నారు. లీడ్‌స్కూల్ సీఈవో సుమిత్ మెహతా, అకడమిక్ డైరెక్టర్ లోలక్ సహకారంతో పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు.

కెమెరామెన్ రవికుమార్‌కు అవార్డు

తెనాలి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెనాలికి చెందిన కెమెరామెన్ రవికుమార్‌కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు లభించింది. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ శనివారం నిర్వహించిన 132వ ఫొటోగ్రఫీ వేడుకల్లో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. రవికుమార్ తీసిన రెస్ట్‌టైం ఫొటోకు అవార్డు లభించింది. ఉన్నత విద్య కౌన్సిల్ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామమోహనరావు, ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు రవికుమార్‌ని అభినందించారు.

గురజాడ అడుగుజాడలు స్ఫూర్తిదాయకం

తెనాలి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో సమాజంలో నెలకొని ఉన్న దురాచారాలను రూపుమాపేందుకు తన రచనల ద్వారా ప్రజలందరినీ చైతన్యవంతులను చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని, ఆయన అడుగుజాడలు తరతరాలకు స్ఫూర్తిదాకమని అంగలకుదురు జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ హెచ్‌ఎం అనురాధ అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతిని పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గురజాడ రచనల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం గురజాడ రచించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ నృత్యరూపకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ప్రదర్శనలో పూర్ణమ్మగా అపర్ణ, ముసలి మొగుడుగా వైష్ణవి, పూర్ణమ్మ తండ్రిగా కరిమున్నీసా, తల్లిగా పల్లవి, నృత్యకళాకారిణిగా పోలేశ్వరి, తిరుపతమ్మలు నటించారు. వీరితో పాటు ఇతర పాత్రలలో శాంతి, కరుణ, సాయిశ్రీ, అవిల, హాసిని. యాస్మిన్, స్రవంతి, పావని నటించారు. అప్పటి దురాచారలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి పలువురి మన్ననలు పొందారు. నృత్యప్రదర్శనకు పగడాల భారతీదేవి దర్శకత్వం వహించారు.

మోసగించిన కమీషన్ వ్యాపారి దర్జాగా యార్డులోకి !

గుంటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం మిర్చియార్డులో నమ్మ కంగా ఎగుమతి వ్యాపారస్తులను నిట్టనిలువునా మోసగించిన కమీషన్ వ్యాపారి దర్జాగా శనివారం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రత్యక్షమయ్యారు. అయినప్పటికీ అధికారులు పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్త మౌతున్నాయి. మిర్చియార్డులో గోపు శ్రీనివాసరెడ్డి, ఆయన భాగస్వామి కిశోర్‌రెడ్డి కమీషన్ వ్యాపారం చేస్తున్నారు. ఎక్స్‌పోర్టర్లతో పాటు కొంతమంది రైతుల వద్ద వీళ్లు దాదాపుగా రూ. 30 కోట్లు అప్పులు చేసినట్లు తేలింది. దీనిపై మార్కెట్ కమిటీకి ఫిర్యాదులు రావడంతో శ్రీనివాసరెడ్డి లైసెన్సుని నిలుపుదల చేశారు. అతను ప్రత్తి పాడు నియోజకవర్గానికి చెందిన ఒక మాజీ నాయకుడిని ఆశ్రయించి అధికారు లపై ఒత్తిడి చేసి హోల్డ్‌లో పెట్టిన లైసెన్సుని రిలీజ్ చేసుకొనే ప్రయత్నాలను ప్రారం భించారు. ఎవరైనా ఎక్స్‌పోర్టర్లు ప్రశ్నిస్తే తాను ఎవరికి బాకీ చెల్లించాల్సిన పని లేదని చెబుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ అధికారులు అతనిపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయరని ఎక్స్‌పోర్టర్లు ప్రశ్నిస్తున్నారు.

'ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ న్యాయసమ్మతమైనదే'

గుంటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్ న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనదని ఆంధ్ర మేధా వుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవ గాహన సంస్థ కార్యాలయంలో ప్రత్యేక హోదా - హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు ధర్మం కాదు అనే అంశంపై శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మబద్ధమైన ప్రత్యేక హోదాను సాధించుకోవటానికి ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రజలకు మరింత నిరాశకు గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, న్యాయవాది అవదానుల హరి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు నిర్వహించాలి



సమస్యలు తెలుసుకుంటున్న అజిత కుమారి

పొన్నూరుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు డిపో నుంచి జిల్లాలోని దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు నిర్వహించాలని ప్రజల నుంచి ఫోన్ విజ్ఞాపనలు అందినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ టీ అజిత కుమారి తెలిపారు. శనివారం 'డయిల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు డిపో నుంచి నగరం మీదుగా రేపల్లె, పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ళ, కృష్ణా జిల్లాలోని విజయవాడ, మచిలీపట్నం, బాపట్ల జిల్లాలోని పర్చూరుకు బస్సు సర్వీసలు నిర్వహించాలని పట్టణానికి చెందిన మోజస్ నాయుడు కోరారు. పొన్నూరు - గుంటూరు మధ్య తిరుగుతున్న పల్లె వెలుగు బస్సులు వెల్లలూరు సచివాలయం వద్ద స్టాప్ సౌకర్యం కల్పించాలని వెల్లలూరుకి చెందిన కె సుబ్బారావు కోరారు. పొన్నూరు నుండి రమణప్పపాలెం, ఆరెమండ బస్సు సర్వీసులు నిర్వహించాలని రవి, తెనాలి బస్సు సర్వీస్‌ను నారాకోడూరు మీదుగా నిర్వహించాలని అబ్దుల్లా బేగ్, బాపట్ల, గుంటూరు మార్గంలో తిరిగే బస్సులకు మాచవరం వద్ద హాల్ట్ సౌకర్యం కల్పించాలని మాచవరానికి చెందిన రమేష్ బాబు కోరారు. ప్రయాణికులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

ఫెన్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు సెయింట్ థామస్ విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సెయింట్ థామస్ విద్యార్థులు

పొన్నూరుటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు సెయింట్ థామస్ కేరళా ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాఠశాల డైరెక్టర్ పీడీ థామస్ తెలిపారు. పాఠశాల్లో శనివారం విద్యార్థుల అభినంద కార్యక్రమం జరిగింది. థామస్ మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్ - 19 బాల బాలికల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన షేక్ జాస్మిన్, సీహెచ్ హదస్సా, ఎల్ వివేక్ రాజ్ ప్రతిభ చూపినట్లు చెప్పారు. షేక్ జాస్మిన్ వ్యక్తిగత ఇప్పీ ఈవెంట్‌లో రజిత పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఖతస్సా ఫాయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రోజ్ థామస్ అభినందించారు. డిసెంబరు 17 నుంచి పాట్నలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

150 మంది పేదలకు దుపట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సదావర్తి సత్రం నిర్వాహకులు

పొన్నూరుటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకునేందుకు సదావర్తి సత్రం అందరికి ఆదర్శంగా నిలుస్తుందని మేనేజర్ కొణకం భవానీ ప్రసాదరావు అన్నారు. కొమ్మూరి రత్తయ్య. సదావర్తి సత్రం ఆధ్వర్యంలో శనివారం పేదలకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 150 మంది పేదలకు, వికలాంగులకు దుపట్లు పంపిణి చేసి అన్న ప్రసాదాని అందించారు. కార్యక్రమంలో సత్రం ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ కొమ్మూరి సుబ్బారావు, అవ్వారు అదెమ్మ సత్రం ఫౌండర్ అవ్వారు వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర్ లక్ష్మీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

431 మందికి నాట్కో ఉచిత వైద్య పరీక్షలు



పొన్నూరుటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 431 మంది హాజరయ్యారు. నాట్కో సంస్థల అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆధ్వర్యంలో 350 మందిని పరీక్షించి 193 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 57 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. అలాగే వైజయంతి డెంటల్ క్లినిక్, బృందా మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణాచార్యులు, ట్రస్ కోఆర్డినేటర్ కె రమణారెడ్డి, డాక్టర్ వై జయంతి, డాక్టర్ ఆవుల రాజశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజం నిర్మిద్దాం



మావన హారంగా ఏర్పడిన విద్యార్థులు

చేబ్రోలు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని తహసీల్దార్ కే శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా పెన్షన్ల పంపిణీ



పట్టణంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ, మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శరవేగంగా జరిగింది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే అధికారులు తమకు కేటాయించిన 50 మంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి దాదాపు 90 శాతం పెన్షన్ల పంపిణీని పూర్తి చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పర్యవేక్షించారు.

బాలాజీరావుపేటలో పెరుగుతున్న చోరీలు

స్థానిక పోలీసుల తీరుపై విమర్శలు

తెనాలి మారీసుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానికి బాలాజీరావుపేటలో యాచకులుగా, బాటసారులుగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం పట్టపగలే లారీ అద్దాలు పగుల గొట్టి దౌర్జన్యానికి పాల్పడగా ,గత మూడు రోజుల క్రితం నివాసితుల ఇళ్లలోకి వెళ్లి చోరీలకు పాల్పడినట్లు చెబుతున్నారు. శనివారం ఓ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి రావడంతో ఆ ఇంట్లో మహిళ కేకలు వేయడంతో ఇంటియజమాని రావడంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. అయితే, ఆ వ్యక్తే మళ్లీ అక్కడికి వచ్చి ఏం చేస్తారోనన్న భయంతో 100కి ఫోన్ చేశారు. అయితే, స్థానిక పోలీసులు ఫిర్యాదు దారుడికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఆ గుర్తుతెలియని వ్యక్తిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకురావాలని చెప్పడంతో సదరు వ్యక్తి విస్మయానికి గురయ్యాడు. పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లినా దిక్కెవరంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాలాజీరావుపేటలో ప్రజలకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

ఈ ఘటనపై సీఐ రమేష్‌బాబును వివరణ కోరగా..

డయల్ 100 కు ఆకతాయిల నుంచి ఫోన్ కాల్స్ ఎక్కువగా రావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఫేక్‌కాల్‌గా గుర్తించి వెనుతిరిగివస్తున్నారన్నారు. ఈ ఫోన్‌కాల్ కూడా అలాంటిదే అనుకొని పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లలేక పోయి ఉంటారని, ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని చెప్పారు.